# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 30 | విశాఖపట్నం | 31-10-2025 శుక్రవారం | చీఫ్ ఎడిటర్ : ఎస్.ఎస్. రాజు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 30 | VISAKHAPATNAM | 31-10-2025 FRIDAY | CHIEF EDITOR: S.S. RAJU | Pages:8 | Rate: Rs.5/-



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంచార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9849349934




# విశాఖ జిల్లాలో భారీగా

# భూమి కబ్జా

## రూ. కోట్ల ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన ప్రభుత్వ ఉద్యోగి

**అది పక్కా సర్కార్ భూమే -మన ప్రభుత్వానిదే**

**జీవీఎంసీ ఉద్యోగి అయిఉండి జీవీఎంసీని బురిడీ కొట్టించిన గజదొంగ**

**ప్రభుత్వ భూమికి ప్లాన్ అప్రూవల్ ముడుపులు తీసుకొని ఇచ్చారా!!**

**కళ్ళు ఉండి కబోదులుగా ఉన్న జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు**

**తప్పుడు రికార్డులతో కబ్జా చేసిన కేటుగాడు**

**ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 2/1బి- 5/1 గా సర్వేనెంబర్ మార్చి రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రభుత్వ ఉద్యోగి**

**భూమి సర్వే చేయకుండానే అనుమతులు ఇస్తారా**

**ప్రభుత్వ ఉద్యోగే, ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తే సామాన్య ప్రజలు పరిస్థితి ఏంటి!**

**స్థానిక ఎమ్మార్వో డబ్బులుకు కమ్ముడుపోయారా!!**

**అధికారులను బురిడీ కొట్టించిన అధికారి అసలు భాగోతం ఆధారాలతో పతాకం న్యూస్ బట్టబయలు**




(పతాకం మేజర్ న్యూస్)

విశాఖ జిల్లా గోపాలపట్నం మండలంలో 90వ వార్డు ఏపీఎస్ బీ కాలనీ లే అవుట్ ఒక ప్లాట్ నెంబర్ వేసి సర్వే నెంబర్ 5/1 డాక్యుమెంట్ చూపించి సర్కార్ భూమి సర్వే నెంబర్ 2/1బి ప్రొహిబిటెడ్ భూమిలో అక్రమ నిర్మాణాన్ని నాలుగు అంతస్తులు భవనం కట్టిస్తుంటే చోద్యం చూస్తున్న అధికారులు. జీవీఎంసీ అధికారులు వినోదంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ భూమి కాపాడే ప్రయత్నం చేయకుండా ముడుపులు తీసుకున్నారని అనుమానాలు కూడబెట్టుకున్నాయి. ముడుపులే తీసుకోకపోతే ఎందుకు చోద్యం చూస్తున్నారు, ఒక ప్రభుత్వ ఉద్యోగి సర్కార్ స్థలాన్ని కబ్జా చేసేసి ఐదు కోట్ల భూమిని కొట్టేసాడంటే అధికారులు కళ్ళు మూసుకుని కబోదులుగా ఉన్నారు అని స్పష్టంగా సహకారాలు అందించినట్టు అర్థం అవుతుంది.

ప్రభుత్వ భూమి కాపాడవలసిన అధికారులు కాపాడుకున్న చోద్యం చూస్తున్నారంటే విడ్డురంగా ఉందని స్పష్టంగా అర్థం అవుతుంది. సచివాలయం నెంబరు 210743 దగ్గర్లో జరుగుతున్న నాలుగు అంతస్తులు భవనం కట్టేసిన ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి దోచుకున్న, ఐదు కోట్ల సర్కారు స్థలం అన్యాయక్రాంతం అయిపోయిన అధికారులు మౌనం వెనక లక్షలాది రూపాయలు ముడుపులు తీసుకోని మూట కట్టుకున్నట్టు అనుమానాలు రేకిస్తున్నాయి. వైయస్సార్సీపి సీనియర్ నేత అండదండలతో ఇదంతా జరిగిందని గుసగుసలు వినబడుతున్నాయి. సామాజిక బాధ్యతతో ఆర్టిఐ కార్యకర్త జిల్లా కలెక్టర్ ని కలిసి చర్యలుకి డిమాండ్ చేస్తున్నట్టు తెలుస్తుంది. ఒకవేళ పట్టించుకోకపోతే, జీవీఎంసీ మా ఉద్యోగి కదా అని, అండదండలు ఉంటే సర్కారు భూమిని దోచుకున్న వారిపై ఏది ఏమైనా సహకరిస్తున్న ఎమ్మార్వో దగ్గర నుంచి జీవీఎంసీ అధికారుల వరకు వీళ్లందరిపై అతి త్వరలో కోర్టుకు వెళ్తున్నట్టు ఆర్టీఐ కార్యకర్త పతాకం న్యూస్‌తో తెలిపారు.




**మిగతా ప్రభుత్వ ఉద్యోగి కబ్జా లీలలు రేపటి సంచికలో...**

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

# సత్వర సాయం

కొద్ది రోజులుగా రాష్ట్రాన్ని భయోత్పాతానికి గురిచేసిన మొంథా తుపాన్ ఎట్టకేలకు తీరం దాటింది. మచిలీపట్నం-కళింగపట్నం మధ్య కాకినాడకు దక్షిణంగా నరసాపురానికి సమీపంలో మొంథా తీరం దాటినట్లు వాతావరణ శాఖ ప్రకటించింది. ముందుగానే అంచనా వేసినట్లు తీవ్ర తుపాన్‌గానే తీరం దాటిన మొంథా కోస్తా జిల్లాల్లో అల్లకల్లోలం సృష్టించింది. తీరం దాటే సమయంలో 90 నుండి 110 కి.మీ వేగంతో వీచిన పెనుగాలులు, ఉవ్వెత్తున ఎగిసిన సముద్రపు అలలు భయానక పరిస్థితిని సృష్టించాయి. వందలాది చెట్లు నేలకూలాయి, విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయి, అనేక ప్రాంతాల్లో అంధకారం అలముకుంది. కోస్తా జిల్లాలన్నింటి మీద తుపాన్ తీవ్ర ప్రభావం చూపినప్పటికీ, కోనసీమ, కాకినాడ, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో భారీ నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. నష్టానికి సంబంధించిన పూర్తి స్థాయి నివేదికలను ప్రభుత్వం రూపొందించాల్సి ఉంది. తుపాన్ కారణంగా ప్రాణ నష్టాన్ని గణనీయంగా నివారించడం ఒక సానుకూల పరిణామం. రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల మంది తుపాన్ బాధితులుగా మారినట్లు, 76 వేల మందికి పైగా పునరావాస శిబిరాలకు తరలించినట్టు, తుపాన్ కారణంగా ముగ్గురు మృతి చెందినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

గతంతో పోలిస్తే అధికార యంత్రాంగం ఈ సారి మరింత అప్రమత్తంగా వ్యవహరించింది. పెనుగాలుల హెచ్చరికల నేపథ్యంలో జాతీయ రహదారిపై భారీ వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేయడం దీనికో ఉదాహరణ! ముఖ్యమంత్రి నుండి మంత్రుల వరకు మారథాన్ సమీక్షలు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు దిశా నిర్దేశం చేశారు. రెవిన్యూ, విద్యుత్‌తో పాటు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు, ఆశా, అంగన్‌వాడీ, పారామెడికల్ సిబ్బంది ప్రశంసనీయమైన కృషి చేశారు. కొందరు ఎంఎల్‌ఏలు, ప్రధాన ప్రతిపక్ష పార్టీకి చెందిన నేతలు కూడా బాధిత ప్రజల వద్దకు వెళ్లడం, వారి కష్ట నష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నం చేయడం మంచిదే. సిపిఎంతో పాటు ప్రజాసంఘాల కార్యకర్తలు తొలి రోజు నుండి సహాయ కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. హెచ్చరికల తీవ్రత దృష్ట్యా తమ కార్యాలయాలను పునరావాస కేంద్రాలుగా మార్చడానికి సంసిద్ధత వ్యక్తం చేయడం, ఆ మేరకు కొన్ని చోట్ల శిబిరాలు ఏర్పాటు చేయడం ప్రత్యేకత! క్లిష్ట సమయంలో రాజకీయ పార్టీలు వ్యవహరించాల్సిన తీరుకు ఇదో ఉదాహరణ. కరోనా సమయంలోనూ సిపిఎం, ప్రజాసంఘాలు ఇదే విధంగా స్పందించడం గమనార్హం. ప్రకృతి విపత్తులు చోటుచేసుకున్నప్పుడు బాధితులను అన్ని విధాల ఆదుకోవడమే అత్యంత కీలకం! తాజా తుపాన్ కారణంగా వ్యవసాయం ముఖ్యంగా వరి, పత్తి తదితర పంటలకు పెద్ద ఎత్తున నష్టం జరిగింది. కోస్తా జిల్లాల్లో ఎక్కడ చూసినా నీట మునిగిన పైర్లు కనపడుతున్నాయి. గింజ పాలుపోసుకునే దశలో చోటుచేసుకున్న ఈ విపత్తుతో రైతాంగం దిక్కుతోచని స్థితిలో పడింది. ఏ గ్రామానికి వెళ్లినా నిండా మునిగిపోయిన తమను ఆదుకోవాలంటూ కన్నీటితో విజ్ఞప్తులు చేస్తున్న అన్నదాతలే కనిపిస్తున్నారు. కొబ్బరి, అరటి తోటలు కూడా విస్తతంగా దెబ్బతిన్నాయి. ఈ సంవత్సరం పంటల బీమా పథకం కూడా రాష్ట్రంలో అమలులో లేకపోవడం గమనార్హం. ప్రభుత్వం తన వాటా కట్టకపోవడంతో ఈ పథకం ఆగిపోయింది. అలాగే మత్స్యకారులు! తుపాన్ వల్ల దాదాపు వారం రోజులుగా వేట ఆగిపోయింది. ఉవ్వెత్తున ఎగిసిన అలల కారణంగా తీరంలో కట్టిఉంచిన బోట్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కొన్ని చోట్ల సముద్రపు ఉధృతికి కొట్టుకుపోయినట్లు వార్తలు వస్తున్నాయి. రొయ్యల రైతులు కూడా భారీగా నష్టపోయారు. సహాయ శిబిరాల్లో చేతిలో పెట్టే కొద్దిపాటి మొత్తం బాధితుల కన్నీరు తుడవడానికి ఏమాత్రం చాలదు. బాధితులకు సత్వర సాయం అందించాలి. ఈ మేరకు అవసరమైన ఎన్యూమరేషన్‌ను వెంటనే ప్రారంభించాలి. కేంద్రం నుండి ప్రకృతి విపత్తు సాయం ఇతోధికంగా అందేట్లు చూడాలి. ప్రధాని, ముఖ్యమంత్రితో ఫోన్‌లో మాట్లాడితే చాలదు. నిధులు మంజూరు చేయాలి. హుద్‌హుద్ వంటి పెనుతుపానులు విరుచుకుపడ్డప్పుడు కూడా కేంద్ర ప్రభుత్వ స్పందన అంతంతమాత్రమే! సాయం కోసం ఏళ్లతరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. ఈ సారి కూడా వట్టిమాటలతో సరిపెట్టకుండా పూర్తిసాయాన్ని తక్షణమే విడుదల చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే!

## పోటెత్తిన వరద


# నిండు కుండలా ప్రాజెక్టులు



**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ లో భారీ వర్షాలకు ప్రాజెక్టులు నిండు కుండలా మారాయి. పల్నాడు జిల్లాలోని పులిచింతల రిజర్వాయర్ కు భారీ వరద నీరు చేరుకుంది. దీంతో ప్రాజెక్ట్ 9 గేట్లు ఎత్తి నీటిని కిందికి విడుదల చేశారు. వరద ఇన్ ఫ్లో 5లక్షల వరుకు చేరే అవకాశం ఉన్నందున ముందుగానే దిగువకు 4.9లక్షల క్యూసెక్కులు నుంచి 5.5 లక్షల క్యూసెక్కుల వరకు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. దీని వలన ప్రకాశం బ్యారేజి నుంచి వరద నీటిని దిగువకు విడుదల చేయనున్నారు. లోతట్టు ప్రాంత లంక గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలంలోని రజాల గ్రామం దగ్గర శారదా నదికి గండి పడింది. దీంతో ఉధృతంగా ప్రవహిస్తున్న శారద నది అక్కడున్న వందల ఎకరాల్లో ఉన్న పంట భూములను నేలమట్టం చేసింది. శారద నది ఉదృతికి శంకరం దగ్గర 100 ఎకరాలు పంట పొలాలు నీట మునిగాయి. దీంతో హరిజాల గ్రామం పూర్తిగా వరద నీటిలో చిక్కుకున్నది. శ్రీశైలం జలాశయానికి వరద నీరు కొనసాగుతుంది. దీంతో జలాశయం వద్ద సైరన్ మోగించి మృత్యకారులకు హెచ్చరికలను జారీ చేశారు. ప్రకాశం బ్యారేజి వద్ద ప్రస్తుతానికి ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 2.74 లక్షల క్యూసెక్కులుగా ఉంది. ప్రకాశం బ్యారేజి వద్ద సాయంత్రానికి మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉంది. వరద ఫ్లో 5 లక్షల క్యూసెక్కులు వరకు చేరే అవకాశం ఉండగా, క్రమంగా వరద తగ్గే అవకాశం ఉంది. లంక గ్రామ ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ పేర్కొన్నారు. నదిలో ప్రయాణం, ఈతకు వెళ్ళడం, చేపలు పట్టడం లాంటివి చేయరాదు.

## తుపాను బీభత్సాన్ని ముందుగానే అంచనా వేశాం

# రూ.5,265 కోట్లు నష్టం: సీఎం చంద్రబాబు




**అమరావతి, పతాకం న్యూస్:** మొంథా తుపాను ప్రాథమిక నష్టం అంచనా దాదాపు రూ.5265 కోట్లు అని సీఎం చంద్రబాబు వెల్లడించారు. పటిష్ఠమైన సమాచార సాంకేతిక వ్యవస్థను 16 నెలల్లో ఏర్పాటు చేశామని తెలిపారు. నీళ్లు ఎక్కడా నిల్వ లేకుండా డ్రైన్స్‌లోకి పంపగలిగామని తెలిపారు. ఎక్కడ నీరు నిలిచినా డ్రోన్లు, సీసీటీవీల ద్వారా గుర్తించి తొలగించగలిగామని అన్నారు. ఒకప్పుడు చెట్టు కూలితే తొలగించేందుకు రోజుల తరబడి సమయం పట్టేదని కానీ ఇప్పుడు అలాంటి పరిస్థితులు లేకుండా గంటల వ్యవధిలోనే సమస్యను పరిష్కరిస్తున్నామని తెలిపారు. రియల్ టైమ్ గవర్నెన్స్ సిస్టం ద్వారా కాటమనేని భాస్కర్ బృందం కనబర్చిన పనితీరు అభినందనీయమని కొనియాడారు. మొత్తం సిబ్బంది అద్భుత పనితీరు కనబరిచారని ప్రశంసించారు. వచ్చే విపత్తును ఆపలేం కానీ ప్రాణ నష్టం జరగకుండా ఎన్ని చర్యలు చేపట్టాలో అన్ని చేపట్టామని సీఎం చంద్రబాబు తెలిపారు. తుపాను వల్ల రాష్ట్రానికి నష్టం వాటిల్లిందని అన్నారు. అలానే దీని వల్ల వ్యవసాయరంగానికి, ఆర్అండ్‌బీకి భారీగా నష్టం వాటిల్లిందని తెలిపారు. ఇంకా తుపాను వల్ల ఎవరూ చనిపోలేదని కానీ 120 పశువులు మృతి చెందాయని వెల్లడించారు. ఈ తుపాను వల్ల ఆర్అండ్‌బీకి ఎక్కువ నష్టం వాటిల్లిందని కానీ నీటిపారుదల శాఖకు సంబంధించి ఈసారి నష్టం తక్కువేనని తెలిపారు. గత ప్రభుత్వం హయాంలో డ్యామ్‌లు కొట్టుకుపోయాయని సీఎం విమర్శించారు. ప్రస్తుతం ప్రాజెక్టు గేట్లు పని చేయలేదని ఎక్కడా ఫిర్యాదు లేదని, మా అప్రమత్తత వల్ల నీటిపారుదల శాఖకు నష్టం తక్కువ వాటిల్లిందని అన్నారు. : రాష్ట్రవ్యాప్తంగా సిబ్బంది అందరూ నిబద్ధతతో పని చేశారని ఇది చాలా సంతోషంగా ఉందని సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. వర్షాలు పడుతున్నా కూలిన చెట్లను ఎప్పటికప్పుడు తొలగించి ఇబ్బందులు లేకుండా చేశారని కొనియాడారు. ప్రకృతి విపత్తులను ఎవరూ ఆపలేరు కానీ ముందస్తు చర్యల వల్ల నష్టాన్ని తగ్గించవచ్చని సీఎం అన్నారు. మ్నొంథా తుపాను బీభత్సాన్ని ముందుగానే అంచనా వేయడం వల్లే నష్టనివారణ తగ్గిందని, ఓ పద్ధతి ప్రకారం సాంకేతికతను సక్రమంగా వినియోగించామని తెలిపారు. గతంలో విద్యుత్ సరఫరా ఆగితే 10 గంటల వరకు వచ్చేది కాదు కానీ ప్రస్తుతం విద్యుత్ సరఫరా ఆగిన 3 గంటల్లోనే పునరుద్ధరణ జరిగిందని సీఎం చంద్రబాబు అన్నారు.

## తుఫాను వల్ల సుమారుగా వేయి ఎకరాలలో దెబ్బతిన్న పంటలు

**అమరావతి, పతాకం న్యూస్:** తుఫాను ప్రభావంతో రాజధాని అమరావతిలోని ఉండవల్లి, పెనుమాక గ్రామాలలో ముఖ్యమంత్రి నివాసానికి కూత వేటు దూరంలో దెబ్బతిన్న పంట పొలాలను గురువారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్. బాబురావు, రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం .రవి, రైతు సంఘం నాయకులు కె జగదీశ్వర రెడ్డిలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బాబురావు జరిగిన పంట నష్టాల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. తుఫాను గాలికి విరిగి పడిపోయిన అరటి తోటలను, వర్షపు నీరు పోయే దారి లేక నిల్వ ఉండి కుళ్ళిపోయిన ఉల్లి పంటను, పొలాల్లోని నీటిలోకి దిగి పరిశీలించారు. ఈ సందర్భంగా సిహెచ్. బాబురావు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఇంటికి సమీపంలోనే తుఫాను వల్ల అరటి, ఉల్లి పంటలతో పాటు పూల తోటలు కూడా దెబ్బతిన్నాయి. గాలుల వలన అరటి తోటలు పడిపోగా, వర్షం వలన ఉల్లి, పూల తోటల్లోకి నీరు చేరింది.

## యువతకు ఉద్యోగాల గేట్‌వేగా 'నైపుణ్యం' పోర్టల్, ప్రతి నెల జాబ్ మేళాలు: ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి, పతాకం న్యూస్:** యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తూనే, వారి ఉన్నత విద్యకు ప్రభుత్వం సహకరిస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఎదురుచూసే వారి కోసం రూపొందించిన 'నైపుణ్యం' పోర్టల్ ఉద్యోగాల గేట్‌వేగా ఉండాలని అధికారులకు సూచించారు. 2029 నాటికి 20 లక్షలు ఉద్యోగాలు అందించాలన్న ప్రభుత్వ సంకల్పాన్ని సాకారం చేసేలా అధికారులు కృషి చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. ఇకపై ప్రతీ నెలా, ప్రతీ నియోజకవర్గంలో జాబ్ మేళాలు నిర్వహించాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. నవంబర్‌లో జరిగే భాగస్వామ్య సదస్సులోగా 'నైపుణ్యం' పోర్టల్‌ను ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సూచించారు. నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందిన వారికి ఇక నుంచి అధికారికంగా ధ్రువపత్రాలు జారీ చేయాలని అన్నారు. గురువారం సచివాలయంలో నైపుణ్యాభివృద్ధి శిక్షణపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్‌తో పాటు ఆ శాఖ ఉన్నతాధికారులు సమీక్షకు హాజరయ్యారు. నైపుణ్యం పోర్టల్, జాబ్ డ్యాష్ బోర్డ్, వివిధ కోర్సులు, ఉద్యోగావకాశాలు తదితర అంశాల గురించి సమీక్షలో చర్చించారు. క్లస్టర్ బేస్డ్ అప్రోచ్ ద్వారా నైపుణ్యాలను పెంచేలా ప్రయత్నిస్తున్నామని, స్పేస్, ఆక్వా, క్వాంటం లాంటి రంగాల్లో సంస్థలు, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందించేలా కార్యాచరణ చేపట్టినట్టు మంత్రి లోకేశ్ ముఖ్యమంత్రికి తెలిపారు. మొత్తం 15 క్లస్టర్ల ద్వారా పరిశ్రమలకు మానవ వనరులను అందించాలన్న లక్ష్యంతో పని చేస్తున్నామని ముఖ్యమంత్రికి వివరించారు. ఈ విధానంపై ఆస్ట్రేలియాలో అధ్యయనం చేసి అమలు చేస్తున్నామన్నారు. దేశ విదేశాల్లో ఉద్యోగాలు ఎక్కడ లభిస్తున్నాయో అందరికీ తెలిసేలా నైపుణ్య పోర్టల్ అభివృద్ధి చేయడమే కాకుండా నైపుణ్య కల్పనలో దేశ, విదేశాలకు చెందిన సంస్థలను సంప్రదించాలని అధికారులకు ముఖ్యమంత్రి నిర్దేశించారు. విశ్వవిద్యాలయాలు, జాతీయ-అంతర్జాతీయ విద్యా సంస్థలతో భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకుంటే ఎక్కువ ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి ఏ లబ్ధి పొందకుండా నిరుద్యోగులుగా ఉన్నవారికి ప్రయోజనం చేకూర్చేలా 'నైపుణ్యం' పోర్టల్‌ను తీర్చిదిద్దాలన్నారు. అభ్యర్థులు ఏ రంగంలో తమకు ఉద్యోగం, ఉపాధి కావాలో ఆ అవకాశాన్ని పొందేలే వివరాలు పోర్టల్‌లో పొందుపరచాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇప్పటివరకు రాష్ట్రంలో నిర్వహించిన జాబ్ మేళాల ద్వారా 1,44,000 మందికి ఉద్యోగాలు లభించాయని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. నైపుణ్యం పోర్టల్ నుంచి ఏఐ ద్వారా అభ్యర్థులు తమ రెజ్యూమ్‌ను రూపొందించుకునే వెసులుబాటు కల్పించినట్టు వెల్లడించారు. వాట్సప్ ద్వారా ఉద్యోగావకాశాల గురించి సమాచారం ఎప్పటికప్పుడు అందిస్తామని చెప్పారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి అన్ని శాఖలు, విభాగాల డేటా బేస్‌ను సమీకృతం చేసి నిజమైన నిరుద్యోగులను గుర్తిస్తున్నామని అధికారులు వివరించారు. ఎక్కడ, ఏ రంగంలో శిక్షణ అందిస్తున్నాం, జాబ్ మేళాలు ఏ ప్రాంతంలో నిర్వహిస్తున్నాం, ఏయే సంస్థల్లో ఎలాంటి ఉద్యోగ ఖాళీలు ఉన్నాయనే దానిపై పోర్టల్ నుంచి అభ్యర్థులకు సమాచారం అందేలా తీర్చిదిద్దామని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఉద్యోగార్థులు ఇంటర్వ్యూలకు సిద్ధమయ్యేలా ఏఐ సిమ్యులేటర్ సైతం నైపుణ్యం పోర్టల్‌లో అందుబాటులో ఉందన్నారు. 'పోర్టల్‌లో ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు, ఇంజినీరింగ్ కళాశాలలు, యూనివర్సిటీలు, వివిధ విద్యా సంస్థలతో పరిశ్రమలు, సంస్థలను అనుసంధానించాలి. విద్యా సంస్థలకు ఫ్యూచర్ ట్రెండ్స్ తెలిసేలా చేయాలి. ప్లేస్మెంట్ వివరాలనూ ట్రాకింగ్ చేసేలా ఉండాలి. స్కిల్ టెస్టింగ్‌కు కూడా అవకాశం కల్పించాలి. పాఠశాల స్థాయిలో విద్యార్థుల నూతన ఆవిష్కరణలను మరింత ఉన్నతీకరించేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో అనుసంధానించాలి. విదేశాల్లో ఉద్యాగావకాశాలు సులభంగా పొందేందుకు వీలుగా ఆయా దేశాల స్థానిక భాషలను నేర్చుకునేలా శిక్షణ అందించాలి. ఏపీ ఎన్ఆర్టీ ద్వారా ఉద్యోగ సమాచారం పొందేలా చూడాలి. నైపుణ్యం పోర్టల్ ద్వారా ఏపీలో యువత అందరికీ ఏ రంగంలో నైపుణ్యం కావాలో దానికి సంబంధించిన శిక్షణ, ప్రస్తుతమున్న సామర్థ్యాన్ని మెరుగుపరుచుకునేలా పునఃశిక్షణ, ఉత్తమ శిక్షణ అందించాలి' అని ముఖ్యమంత్రి అధికారులకు నిర్దేశించారు.

## ప్రభుత్వం ఆదుకోవాలని మత్స్యకారుల నిరసన



**అనంతగిరి, పతాకం న్యూస్:** ప్రభుత్వం తమకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని తాటిపూడి జలసాయ దిగి బోటులతో మత్స్యకారులు నిరాశన కార్యక్రమం చేపట్టారు. మొంధా తుఫాన్ కారణంగా నాలుగు రోజులు పాటు తాటిపూడి జలశయానికి వేటకు వెళ్ళలేదని తమ కుటుంబంతో ఆర్థికంగా పస్తులతో ఉంటున్నామని తక్షణమే కూటమి ప్రభుత్వం తమకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరుతూ. మండలంలోని చిలకలగెడ్డ పంచాయతీ పరిధి మెట్టపాలెం. దెబ్బలపాడు. జీలుగులపాడు. గ్రామాలకు చెందిన 70 మంది కుటుంబ గథభా పివిటిజి ఆదివాసి మత్స్యకారులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మత్స్యకారుల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ కిల్లో. రమేష్.దేముడు. ఎస్.మద్దు లు మాట్లాడుతూ తాటిపూడి జలసాయంపై ఆధారపడి తమ జీవన ఆధారం కొనసాగిస్తున్నామని. అయితే నాలుగు రోజులుగా తుపాను కారణంగా వేటకు వెళ్ళకపోవడంతో తమ కుటుంబం అర్ధాకలితో గడపవలసిన పరిస్థితి తక్షణమే ప్రభుత్వం ఒక్కొక్క కుటుంబానికి 10,వేలు చొప్పున ఆర్థిక సాయం అందించే ఆదుకోవాలని .అంతేకాకుండా గత ఏడాదిలో అప్పటికి ఓ తమ గ్రామానికి సందర్శించి మత్స్యకారులకు ఆదుకునేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ప్రకటనలకు పరిమితమైంది తప్ప ఆసనాలు అమలు కాలేదని. నేటి వరకు కనీసం వల్లలు కూడా పంపిణీ చేసిన దాఖలు లేదని అంతే కాకుండా తాము స్వయంగా నిర్మించుకున్న నాటు బోటులతో చేపల వేట కొనసాగిస్తున్నామని ఇప్పటికైనా సరే ప్రభుత్వం అన్ని రకాల ఆదుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు

# బల్క్ డ్రగ్స్ పార్క్ రద్దు చేసేంతవరకు పోరాటం ఆగదు



నక్కపల్లి, పతాకం న్యూస్: ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే బల్క్ ట్రక్ పార్క్ కంపెనీ రద్దు చేసేంతవరకు ఉద్యమం ఆగదని రాజయ్యపేట మత్స్యకారులు తెలియజేశారు. బల్క్ డ్రగ్స్ పార్క్ వ్యతిరేక ఉద్యమం గురువారం నాటికి 47వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా మత్స్యకారులు మాట్లాడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే బల్క్ డ్రగ్స్ పార్క్ రద్దు చేసేంతవరకు పోరాడుతామని ఇప్పటికే పోలీసులు అమాయకమైన మత్స్యకారులపై కేసులు పెట్టి మత్స్యకారులను భయాందోళనలకు గురిచేస్తున్నారని అయినా పోరాటం చేస్తామని పోరాటం మత్స్యకారులకు కొత్త కాదని నిరంతరం సముద్రాన్ని దాటుకుంటూ బతుకే పోరాటం దిశగా కొనసాగుతుందని అలాంటి మత్స్యకారులను ఇబ్బంది పెట్టే విధంగా ఎన్ని చేసినా ఈ ఉద్యమాన్ని ఆపమని కలిసి వచ్చిన గ్రామాలు అన్నిటిని కలుపుకొని ఈ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు బి. బాబ్జి, మత్స్యకార నాయకులు గోశాల సోము, తాతీలు, సూరిబాబు, స్వామి, కాశి, సిహెచ్ సోమేశ్, ఎం. సోమేశ్, దేవుడు, నాగరాజు, వీరన్న, లోకనాథం , ఆదిరాజు, నూకరాజు , నారాయణరావు తదితరులు పాల్గొన్నారు

## ఈదురుగాలులకు పలుచోట్ల నేలకొరిగిన వృక్షాలు, విద్యుత్ స్తంభాలు



**అల్లూరి, పతాకం న్యూస్:** మొంథా తుఫాను నేపథ్యంలో మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుంది. వర్షానికి తోడు బలమైన ఈదురు గాలులు వేయడంతో మండలంలో లబ్బర్తి, దూసరపాము, కిండ్రరోడ్ వయ్యాడు తదితర ప్రాంతాల్లో వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేల కోరడంతో మండలంలో విద్యుత్తుకు 12గంటలుగా అంతరాయం ఏర్పడింది. రహదారికి అడ్డంగా కూలిన వృక్షాలను యుద్ధ ప్రాతిపతికన తొలగించాలనిస్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్,తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు, రాజవొమ్మంగి సీఐ గౌరీశంకర్,ఎస్సై శివకుమార్ ఆదేశించారు. మండలంలోని వనకరాయి గ్రామంలో పెద్ద చింతచెట్టు మేకలు కళ్ళంపై కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఒక మేక మృతిచెందగా మిగతా ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్ తెలిపారు. రాజవొమ్మంగి నుండి అడ్డతీగల వెళ్లే రహదారిలో కరెంట్ స్తంభాలపై చెట్లు కూడడంతో విద్యుత్ స్తంభాలను విద్యుత్ శాఖ అధికారులు తిరిగి కొత్తవి ఏర్పాటు చేసే పనిలో నిమగమయ్యారు. భారీ వర్షాలకు ఒట్టిగడ్డ, గింజర్తి, నెల్లిమెట్ల, మాతంగి లబ్బర్తి అనంతగిరి వాగులు పొంగి ప్రవహించడంతో అటుగా వెళ్లే రాకపోకలు నిలిచిపోయాయి. పూర్తిగా వరదలు తగ్గేవరకు ప్రజలు రాకపోకలు సాగించరాదని అధికారులు ప్రజలను కోరారు. మండలంలోని ప్రత్తి,వరి,పొగాకు పంటలు ఈదురు గాలులకు పలుచోట్ల నేలకోరిగాయి. ఈ నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పలు వాగులను అధికారులు పర్యవేక్షించి వాగులు ఎట్టి పరిస్థితుల్లోనూ దాటకూడదని సూచించారు. వాగుల వద్ద అధికారులు పహార కాశారు. రానున్న రెండు రోజులు తుఫాను ప్రభావంతో వర్షాలు ఎక్కువగా కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావద్దని,ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని, వద్ధులు చిన్నపిల్లలు గర్భిణీలు బాలింతలు మరింత జాగ్రత్తగా ఉండాలని సూచించారు, ప్రజలు రైతులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## అద్వాన్నంగా బిఎన్ రోడ్డు.. నీట మునిగిన పంట పొలాలు



**అనకాపల్లి, పతాకం న్యూస్:** మోంతా తుఫాను బీభత్సం సృష్టిస్తుంది. గత నాలుగు రోజుల నుండి తెరిపి ఇవ్వకుండా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. గురువారం తెల్లవారుజాము నుండి కుండపోత వర్షం కురుస్తోంది. ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. వాగులు, వంకలు, చెరువులు, నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. వడ్డాదిలో పెద్దేరు ప్రమాదకర స్థాయిలో ఉప్పొంగి ప్రవహిస్తుంది. వందలాది ఎకరాలు పంట పొలాలు నీట మునిగాయి. రోడ్లన్నీ ఛిద్రంగా మారాయి. బిఎన్ రోడ్లో గోతులు చెరువులను తలపిస్తున్నాయి. చిరు వ్యాపారులు ఉపాధి కూలీలు వర్షాలకు ఉపాధి కరువై ఇబ్బంది పడుతున్నారు. రాజాంలో అప్పలనాయుడు చెరువుకి గండి కొట్టింది. వరద నీరంతా ఆర్టీ రోడ్డుపై పొంగి ప్రవహిస్తోంది. రోడ్డుపై మోకాళ్ళ లోతు నీరు ప్రవహిస్తోంది. దీంతో రాజాం నుండి తట్టబంద వైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వాహనదారులు నీటి ప్రవాహానికి ప్రమాదాల బారిన పడ్డారు. ఇక్కడ చెరువులన్నీ ఆక్రమణలకు గురవడంతో తరచూ గండి కొడుతున్నాయని స్థానికులు ఆరోపించారు. చెరువులలో ఆక్రమణలు తొలగిస్తే ఈ పరిస్థితి రాదన్నారు.మండల ప్రత్యేక అధికారి గోపాల రాజు, తహసిల్దార్ లక్ష్మి, ఇతర శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని అంచనా వేస్తూ సహాయక చర్యలు చేపడుతున్నారు.

## అడ్డతీగల పంచాయితీలో పెసా గ్రామసభ వాయిదా

**అడ్డతీగెల, పతాకం న్యూస్:** గురువారం ఉదయం 10:30 గంటల నుండి పెసా గ్రామసభ అడ్డతీగల గ్రామ సచివాలయం వద్ద గ్రామ సర్పంచ్ .పప్పుల చిట్టమ్మ అధ్యక్షతలో పి శ్రీనివాసరావు (ఎమ్ ఈ ఓ) పెసా ఎన్నికల అధికారిగా పెసా గ్రామ సభను నిర్వహించారు కానీ మధ్యాహ్నం 2.00 గంటల వరకు వేచి చూసినప్పటికీ తగినంత కోరం సభ్యులు లేనందున మరియు ఉపాధ్యక్షులు, కార్యదర్శి అభ్యర్థుల నుండి నామినేషన్ దరఖాస్తులు కూడా రాలేదు కావున సర్పంచ్ నిర్ణయం మేరకు 4 .11 .2025 తారీకున మధ్యాహ్నం 2.00 గంటలు నుండి పేసా గ్రామ సభను నిర్వహించ బడును అని ఎన్నికల అధికారికి తెలియజేయడం జరిగినది. ఈ సభలో రాంబాబు పంచాయతీ సెక్రెటరీ సూర్య కుమార్ ,, డిజిటల్ అసిస్టెంట్ ,వెల్ఫేర్ అసిస్టెంట్ పిసీ గ్రామ సభ్యులు ,సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



## జనసేన నేత సూర్యచంద్ర ఆధ్వర్యంలో సహాయక చర్యలు



**నాతవరం, పతాకం న్యూస్:** నర్సీపట్నం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర ఆధ్వర్యంలో మొంథా తుఫాన్ బాధితులకు సహాయక చర్యలు చేపట్టారు. నాతవరం మండలం ఏపీ.పురం పంచాయతీ గుర్రంపేట గ్రామంలో గురువారం వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఇంటి వద్దకే కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సూర్యచంద్ర మాట్లాడుతూ, ఉపముఖ్యమంత్రి మరియు జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఈ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ముందుచూపుతో తీసుకున్న చర్యల వలన తుఫాన్ ప్రభావం తక్కువగా ఉందన్నారు. వర్షాల వలన దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి, నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆపదలో ఉన్న ప్రజలకు ఎల్లప్పుడూ అండగా నిలిచే పార్టీగా జనసేన కొనసాగుతుందన్నారు. అనంతరం నాతవరం జనసేన కార్యాలయంలో కూడా బాధితులకు కూరగాయలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షులు పూడి చక్రవర్తి, జిల్లా కార్యదర్శులు అల్లాడ సురేష్, పంచాద హరినాథ్, వైస్ ఎంపీపీ ఇన్నం రమణ, మండల అధ్యక్షులు వెలగల వెంకటరమణ, నాయకులు పోలుపర్తి శ్రీనివాస్, గుడివాడ అసేన్ కుమార్, వర్రే నరసింహ, రెడ్డి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి విశాఖలో రాష్ట్ర రేడియాలజిస్టుల మహాసభ



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నంలోని గీతం మెడికల్ కాలేజ్ యెల్లప్రగడ సుబ్బారావు ఆడిటోరియం వేదిక గా ఈ నెల అక్టోబర్ 31, నవంబర్ 1, 2 తేదీలలో రాష్ట్ర రేడియాలజిస్టుల వార్షిక మహాసభ జరుగనుందని ఎపిఐఆర్ఐఎ అధ్యక్షుడు డాక్టర్ వి. సురేష్ (డాల్ఫిన్ డయాగ్నస్టిక్స్) తెలిపారు. గురువారం ఉదయం విశాఖపట్నంలోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ మహాసభలను పార్లమెంట్ సభ్యులు ఎం.శ్రీభరత్ , రేడియాలజిస్టు, ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సంయుక్తంగా ప్రారంభిస్తారని గీతం ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ గీతాంజలి బాట్ మానాభనే, ఎన్ఆర్ఐ రేడియాలజిస్టు డాక్టర్ ముక్కమాల అప్పారావు, నేషనల్ ఐఆర్ఐఎ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జి.వి. మోహన్ ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని ఆయన తెలిపారు. సదస్సు మొదటి రోజు, అక్టోబర్ 31న, ఫీటల్ రేడియాలజీపై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించనున్నామని రాష్ట్రంలో తొలిసారిగా సిమ్యులేషన్ పద్ధతిలో భ్రూణ దశలోని శిశువుపై ఇమేజింగ్ ఆధారిత ఇంటర్వెన్షన్ విధానాలైన అమ్నియోసెంటీసిస్, షంట్ ప్లేస్‌మెంట్‌లను ప్రత్యక్షంగా ప్రదర్శించనున్నామని తెలిపారు. ఈ వర్క్‌షాప్‌కు తమిళనాడుకు చెందిన డాక్టర్ భావహరణ్, మహారాష్ట్రకు చెందిన డాక్టర్ శిల్పా సతర్కర్, బెంగళూరుకు చెందిన డాక్టర్ కృష్ణ ప్రధాన ఫ్యాకల్టీగా వ్యవహరించనున్నారని తేలిపారు. రెండవ ,మూడవ రోజుల్లో వైద్య ఉపన్యాసాలు, ప్యానెల్ చర్చలు శాస్త్రీయ పత్రాల ప్రదర్శనలు జరుగనున్నాయి. ఈసారి రికార్డు స్థాయిలో 160 రేడియాలజీ పరిశోధనా పత్రాలు సమర్పించబడ్డాయి. వీటిలో ఉత్తమ 12 పత్రాలను వేదికపై ప్రదర్శించి, అత్యుత్తమ మూడు పత్రాలకు పురస్కారాలు అందజేయనున్నామని అన్నారు. ప్రత్యేక ఆకర్షణగా రాష్ట్ర స్థాయి రేడియాలజీ క్విజ్ నిర్వహించనున్నారు. దీనిని ఎయిమ్స్ న్యూ ఢిల్లీకి చెందిన ప్రొఫెసర్ డాక్టర్ రాజు శర్మ నిర్వహించనున్నారు. ఆయనే ఈ సంవత్సరపు ప్రతిష్ఠాత్మకమైన 'కాకర్ల సుబ్బారావు ఉపన్యాసం'ను కూడా ఇవ్వనున్నారని అదేవిధంగా తిరుపతికి చెందిన ఎస్.వి.ఐ.ఎం.ఎస్. ప్రొఫెసర్ ఆఫ్ రేడియాలజీ డాక్టర్ ఎ. వై. లక్ష్మి కి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు అందజేయనున్నామని ఆయన తెలిపారు. ఈ ప్రతిష్ఠాత్మక సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా పొరుగు రాష్ట్రాల నుంచి సుమారు 750 మంది రేడియాలజిస్టులు, వైద్య అధ్యాపకులు, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులు, రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలల రేడియాలజీ విభాగాధిపతులు హాజరై వైద్య విద్యలో కొత్త ధోరణులు, టెక్నాలజీ వినియోగం, రేడియాలజీ శిక్షణలో అభివృద్ధి మార్గాలు వంటి అంశాలపై చర్చించనున్నారని తెలిపారు. ఈ సమావేశం సందర్భంగా ఎపి ఐఆర్ఐఎ జనరల్ బాడీ మీటింగ్‌లో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారని ఆయన తెలిపారు. ఈ మీడియా సమావేశంలో డాక్టర్ బుజ్జిబాబు (హెచ్.ఓ.డి., కె.జి.హెచ్.), ప్రొఫెసర్ ఉమా మహేశ్వరరావు, డాక్టర్ వర్మ (హెచ్.ఓ.డి., అపోలో ఆసుపత్రులు), డాక్టర్ రఘు (గీతం కళాశాల) పాల్గొన్నారు.

## తుఫాన్ బాధితులకు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి



**అల్లూరి జిల్లా, పతాకం న్యూస్:** తుఫాన్ కారణంగా బలపం పంచాయతీ చింతపల్లి మండలం చెందిన రాళ్లగడ్డ గ్రామంలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేని వర్షం కురవడంతో గేమిలి సన్యాసిరావు సునీత సీందరి రమణ ఎస్తేరమ్మ వారి ఇంట్లో పైన బలమైన చింతచెట్టు ఇరుగు పడడంతో ఎంతో శ్రమించి కట్టుకున్న ఇల్లు ఒక్కసారిగా శిధిలావస్థకు చేరుకుంది కావున ప్రభుత్వ అధికారులు గుర్తించి నష్టపరిహారం ఆ పేదరైతుకి ఇవ్వాలి అని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు స్థానిక గ్రామస్తులు నాయకులు జి మోహన్ రావు మాజీ వాలంటరీ రామారావు సోమరాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## పాడేరు ఘాట్లో విరిగిపడిన కొండచరియలు, బండ రాళ్లు



**పాడేరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా పాడేరు ఘాట్ రోడ్లో గురువారం వేకువ జామున కొండచరియలు బండరాళ్లు పడ్డాయి. మోదపల్లి జంక్షన్ కు సమీపంలో వంజంగి కాంతమ్మ వ్యూ పాయింట్ దగ్గర పెద్ద పెద్ద బండ రాళ్లు విరిగిపడ్డాయి. దీంతో ఆ ప్రదేశంలో తారు రోడ్డు తునా తునకలైంది. రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో ట్రాఫిక్ దిగ్బంధం ఏర్పడింది. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇప్పుడు బండరాళ్లను తొలగించి పూర్తిగా ధ్వంసమైన రోడ్డు మరమ్మతులు అత్యవసరంగా చేపట్టి ట్రాఫిక్ ను పునరుద్ధరించవలసిన పరిస్థితి ఏర్పడింది. తుఫాన్ కారణంగా కొండ చరియలు విరిగిపడే ప్రమాదం ఉన్నందున అధికారులు బుధవారం కూడా పాడేరు ఘాట్ లో ట్రాఫిక్ పూర్తిగా నిలిపివేశారు. ఇటు పాడేరు ఘాట్ రోడ్లో అరకు ఘాట్ రోడ్లో బండ రాళ్లు విరిగిపడిన పరిస్థితుల వల్ల రెండు రోజుల నుంచి ట్రాఫిక్ స్తంభించింది. మన్యంలో మొంథా తుఫాన్ ప్రభావం వల్ల మూడు రోజులు ఏకధాటిగా వర్షాలు కురిసిన పరిస్థితి వల్ల ఘాట్ రోడ్ లో కొండ చరియలు బండ రాళు విరిగిపడే పరిస్థితి ప్రమాదకరంగా మారింది. బుధవారం సాయంత్రం కొంతసేపు వాతావరణం తెరిపిచ్చిన మళ్లీ రాత్రి నుంచి యధావిధిగా వర్షం పడుతుంది. ఈ పరిస్థితి కారణంగా ఘాట్ రోడ్లో ప్రయాణం ప్రమాద భరితంగా మారింది.

## మొంథా తుఫాన్ ప్రభావం మండల చుట్టుపక్కల గ్రామంలో తీవ్ర నష్టం



**రంపచోడవరం, పతాకం న్యూస్:** అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం డివిజన్ అడ్డతీగల మండలం మొంథా తుఫాన్ ప్రభావం వల్ల మండల చుట్టుపక్కల గ్రామంలో తీవ్ర ఇబ్బంది వాటిల్లిందని ఎంపిడిఓ మరియు ఎమ్మార్వో సందర్శించడం జరిగింది. వేటమామిడి గ్రామం వద్ద రాత్రి కురిసిన భారీ వర్షం వల్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగినవి అలాగే అనిగేరు గ్రామం దగ్గర ఉన్న కల్వర్టు కోతకు గురైందని అక్కడున్న మండల ఇంజనీరింగ్ అధికారికి ఆ పని పూర్తి చేయించవలసిందిగా వారిని కోరారు. చేనుపాకలు గ్రామంలో ఇంటి పరిసర ప్రాంతాల్లో నిలవ ఉన్న నీటిని వెంటనే మోటర్ ద్వారా బయటకు పంపించేలా చర్యలు తీసుకున్నారు.ఎమ్మార్వో అడ్డతీగల కార్పెంటర్ కాలనీలో డ్రైనేజీలను పరిశీలించి పరిష్కారం అయ్యేలా చూస్తా అన్నారు.ఎంపిడిఓ మరియు ఎమ్మార్వో, విఆర్వో,రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, కూటమి నాయకులు హాజరైనారు.

# విపత్తు.. సిక్కోలు వణుకు!

## తీర ప్రాంతాల్లో పంటలకు అపార నష్టం



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** తుఫాన్.. ఈ మాట వింటేనే సిక్కోలు వణికిపోతుంది. సువిశాల తీర ప్రాంతం జిల్లాకు వరమో.. శాపమో తెలియడం లేదు. తీరప్రాంత పరిరక్షణ, హార్బర్లు, జెట్టీల నిర్మాణం లేదు. అనుబంధ పరిశ్రమల ఏర్పాటు లేదు. కానీ బంగాళాఖాతానికి ఆనుకుని జిల్లా ఉండడంతో ఏటా రెండు, మూడు తుఫాన్ల ముప్పు తప్పడం లేదు. ప్రతి నాలుగేళ్లకు ఓ పెను విపత్తు ప్రభావం చూపుతూనే ఉంటోంది. 1999లో సూపర్ సైక్లోన్ నుంచి 2018 తితలీ తుఫాన్ వరకూ ప్రతి విపత్తు జిల్లాను కోలుకోలేని దెబ్బతీసింది. ఫైలిన్, లెనిన్, హుద్ హుద్, తితలీ తుఫాన్లు జిల్లాకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. తాజాగా మొంథా తుఫాన్ ప్రభావంతో వర్షాలు విస్తారంగా కురుస్తుండడంతో జిల్లావాసులు ఆందోళన చెందుతున్నారు. ఏడేళ్ల కిందట ఉద్దానంలో తితలీ తుఫాన్ సృష్టించిన ప్రళయంతో కొబ్బరి, జీడిచెట్లన్నీ నేలకొరిగాయి. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న వేళ.. మొంథా తుఫాన్ రైతుల కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. జిల్లాలో 11 మండలాల్లో తీర ప్రాంతం 193 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. తుఫాన్ ప్రభావిత తీర గ్రామాలు 250వరకూ ఉన్నాయి. కాలుష్యం, భూతాపం పెరగడం, వాతావరణ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో భూమిపై ఏర్పడాల్సిన ఉపరితల ఆవర్తనాలు దిశ మార్చుకుంటున్నాయి. సముద్ర మట్టంపై విస్తరించి ఒకేసారి తీరంపై దాడి చేస్తున్నాయి. ఫలితంగా ఈదురుగాలులు, వర్షాలతో కొబ్బరికి, జీడి మామిడికి నష్టం వాటిల్లుతోంది. అంతర్ పంటగా వేసుకున్న పనస, అరటి, మునగ, కూరగాయలు, ఇతరత్రా పంటలకు నష్టం తప్పడం లేదు. తీర మండలాల పరిధిలో 1.80 లక్షల ఎకరాల వరికి, లక్ష ఎకరాలకుపైగా జీడి, కొబ్బరికి, 20 వేల ఎకరాల్లో సాగవుతున్న పనస, అరటి, ఇతర పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. వీటి ఆధారంగా జీవనోపాధి పొందుతున్న ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లాలో తీర ప్రాంతంలో అటవీ భూములు 14 వేల హెక్టారులు ఉన్నాయి. చిత్తడి నేలలు 8 వేల హెక్టారులు, ఉద్యానవన పరిధిలో వచ్చే జీడి, కొబ్బరి, మామిడి వంటివి 1.20 లక్షల ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. మరో 12 వేల ఎకరాల్లో ఆక్వా సాగవుతోంది. అయితే అటవీ శాఖ భూమి పూర్తిగా ఆక్రమణలకు గురవుతోంది. అటు చిత్తడి నేలల పరిరక్షణకు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదు. అటవీ భూములు ఆక్రమణకు గురయ్యాయి. 5 వేల ఎకరాలు అక్రమార్కుల బారిన పడి జీడి, కొబ్బరి తోటలు వెలిశాయి. కొన్ని ప్రాంతాల్లో చేపల చెరువులను ఏర్పాటు చేశారు. సరుగుడు, మొగలి, తాటి చెట్లు తీరంలో లేకుండా పోతున్నాయి. దీంతో ఉష్ణతాపంతో అలల తీవ్రత పెరిగి తీరం కోతకు గురవుతోంది. తుఫాన్ల సమయంలో ఈదురుగాలులు నేరుగా తీరానికి తాకి భూభాగంపై వెళుతున్నాయి. అదే సమయంలో వర్ష తీవ్రత ఉంటే కొబ్బరి చెట్లు కూకటివేళ్లతో పెకిలించబడుతున్నాయి. ఉద్దానం గ్రామాలకు అపార నష్టం కలుగుతోంది.

## తెలంగాణపై మొంథా తుఫాన్ ప్రభావం



**హైదరాబాద్, పతాకం న్యూస్:** మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణలోని పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. తుఫాన్ ప్రభావంతో పలు జిల్లాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దాంతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భారీ వరదలతో రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. పలు ప్రాంతాలను వరదనీరు ముంచెత్తింది. వరద నీరుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో వరంగల్, హన్మకొండ, జనగాం, యాదాద్రి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేసారు. ఉమ్మడి వరంగల్ జిల్లాపై మొంథా తుఫాన్ పంజా విసిరింది. భారీ వర్షాలతో వరంగల్‌లో రహదారులు నీట మునిగాయి. అత్యధికంగా పర్వతగిరిలో 34 సెం.మీ వర్షం, కాపులకనుపర్తిలో 25.2, రెడ్లవాడలో 24.6 సెం.మీ, భీమదేవరపల్లె 21.3 సెం.మీ, గూడురులో 23.5, వర్ధన్నపేటలో 22.8 సెం.మీ వర్షం నమోదు అయింది. హన్మకొండ, ములుగు జిల్లాల్లో కురుస్తున్న వర్షాలకు నేడు హన్మకొండ, ములుగు జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. తుఫాన్ కారణంగా ప్రజలు బయటకు రావొద్దని అధికారుల సూచనలు చేశారు. ఖమ్మం జిల్లాలోని కొణిజర్ల మండలం తీగల బంజర వద్ద పగిడేరు వాగు ఉధృతంగా పారడంతో 20 గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి.

## చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** శ్రీకాకుళం జిల్లా సంతబొమ్మాళి మండలంలోని నౌపడ పంచాయితీ సీతానగరం గ్రామానికి చెందిన మత్స్యకారుడు బచ్చల భీమారావు (55) గురువారం చేపల వేటకు వెళ్లి మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు సీతానగరం సమీపంలోని పల్లం కాణా వద్ద భీమారావు ఎప్పటిలాగే చేపల కోసం వలలు వేశాడు. ఒక వల వేసి, రెండో వల వేస్తూ ఉండగా అదే వల కాళ్ళకు చుట్టుకుని నీటిలో చిక్కుకుపోయాడు. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో ఎంత ప్రయత్నించినా బయటికి రాలేక మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న నౌపడ పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈయన భార్య గతంలోనే చనిపోవుగా ఇద్దరు కుమారులు ఉన్నారు. అందరితో కలివిడిగా ఉండే భీమారావు మరణ వార్త సీతానగరం గ్రామంలో విషాదఛాయలు నింపింది.

# కార్మికులను, రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



**రాజవొమ్మంగి, పతాకం న్యూస్ :** 1మొంథా తుఫాన్ ప్రభావంతో ఏజెన్సీలో గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు భవన నిర్మాణ కార్మికులు,వ్యవసాయ కూలీలు,హమాలీలు, ఆటో, రిక్షా, ఇతర రంగాల్లో పనిచేసే కార్మికులు వ్యవసాయ,ఉపాధి కూలీలు పనులులేక ఇళ్ళకే పరిమితమయ్యారని వాళ్ళ రోజువారి జీవన విధానం తీవ్రంగా దెబ్బతిని ఆర్థికంగా నష్టపోయారన్నారు.ఈ నేపథ్యంలో వారిని ప్రభుత్వం ఆదుకోవాలని భవననిర్మాణ రంగం జిల్లా కార్యదర్శి, సీఐటీయూ రంపచోడవరం జిల్లా ఉపాధ్యక్షులు పి రామరాజు గురువారం కోరారు.తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలు ఇతర ఆస్తులు పై అధికారులు సర్వే నిర్వహించే క్రమంలో తుఫాను వలన పనులు లేక ఇళ్లకే పరిమితమై తీవ్రంగా నష్టపోయిన కార్మికులను, వ్యవసాయ,ఉపాధి కూలీలను ఇతర రంగాల కార్మికులను పరిగణలోకి తీసుకొని వారిని ఆదుకునే విధంగా అధికారులు కృషి చేయాలని కోరారు. వారు చేసే రోజువారి పనుల మీద వచ్చే కూలి సొమ్ము తో డ్వాక్రా రుణాలు, ఇతర అప్పులు తీర్చవలసిన పరిస్థితి ఉందన్నారు. అలాగే పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోవాలని కోరారు. తుఫాను ప్రభావంతో ఏజెన్సీలో ఇంకా వర్షాలు కొనసాగుతున్న దృష్ట్యా కార్మికులు,రైతులు, వ్యవసాయ,ఉపాధి కూలీలు జాగ్రత్తలు పాటించాలన్నారు.

## మెడికల్ కాలేజీల పీపీపీ విధానం..

## ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేం: హైకోర్టు



**అమరావతి, పతాకం న్యూస్:** పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు నిర్మించాలనేది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని.. అది చట్టవిరుద్ధం అయితే తప్ప కోర్టులు జోక్యం చేసుకోలేవని ఏపీ హై కోర్టు స్పష్టం చేసింది. టెండర్ ప్రక్రియను అడ్డుకుంటూ ఈ దశలో ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు క్లారిటీ ఇచ్చింది. థర్డ్ పార్టీకి హక్కులు కల్పించకుండా అడ్డుకోవాలని పిటిషనర్ అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది. కౌంటర్ దాఖలు చేసేందుకు ఏపీ ప్రభుత్వానికి మరికొంత సమయం ఇచ్చింది హైకోర్టు. తదుపరి విచారణని నాలుగు వారాలకు న్యాయస్థానం వాయిదా వేసింది. మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేస్తూ ఇచ్చిన జీవో నెంబర్ - 590ని సవాల్ చేస్తూ తాడేపల్లికి చెందిన సామాజిక కార్యకర్త డాక్టర్ కొర్రా వసుంధర హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. హైకోర్టులో వేసిన పిల్‌పై ఇవాళ(బుధవారం) విచారణ జరిగింది. ఈ వ్యాజ్యంపై పిటీషన్ తరపున హైకోర్టులో సీనియర్ న్యాయవాది శ్రీరాం, మరో న్యాయవాది అశోక్ రాం వాదనలు వినిపించారు. టెండర్లు ఖరారు చేయకుండా స్టే ఇవ్వాలని న్యాయవాదులు అభ్యర్థించారు. న్యాయవాదుల అభ్యర్థనని తిరస్కరించింది హైకోర్టు. కాలేజీలు, ఆస్పత్రులను పీపీపీ విధానంలో చేపట్టాలని తీసుకున్న నిర్ణయంలో లాభ, నష్టాలను సమగ్రంగా పరిశీలించాలని హైకోర్టు పేర్కొంది.

## వర్షాకాల వ్యాధులపై జాగ్రత్త వహించాలి



**గొలుగొండ, పతాకం న్యూస్:** గొలుగొండ మండలం సాలికమల్లవరం గ్రామంలో గొలుగొండ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ శ్యాం కూమార్ నేతృత్వంలో జరిగిన ఈ శిబిరంలో గ్రామస్తులకు ఉచిత వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వర్షాకాలంలో మురికి నీరు,దోమలు వల్ల తలెత్తే వ్యాధుల నివారణకు శుభ్రత పాటించడం,కాచిన మంచినీటిని తాగడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ శ్యాం కూమార్ ప్రజలకు వివరంగా తెలిపారు. ఈ అంశాలపై ఆయన సమగ్ర అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఏ సూపర్‌వైజర్ నాయుడు, ఏఎన్ఎం,ఆశా వర్కర్లు పాల్గొని సహకరించారు.గ్రామస్తులు ఈ క్యాంపును ఉత్సాహంగా సద్వినియోగం చేసుకోవడం జరిగింది.

## ఎట్టకేలకు రాజేంద్రపాలెం పీసా ఉపాధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవం



**కొయ్యూరు పతాకం న్యూస్:** ఎట్టకేలకు వాయిదాలు ఎదుర్కొంటూ సాగిన కొయ్యూరు మండలం,రాజేంద్రపాలెం పీసా ఉపాధ్యక్ష ఎన్నిక ఈరోజు విజయవంతంగా పూర్తయింది.కొయ్యూరు తహసీల్దార్ కార్యాలయ ఏ.యస్.ఓ చైతన్య ఆధ్వర్యంలో, సానుకూల వాతావరణంలో ఎన్నికను నిర్వహించారు.ఈ ఎన్నికలో గంగరాజు (బాలకృష్ణ) ఏకగ్రీవంగా పీసా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నిక సజావుగా జరగడానికి సహకరించిన గ్రామ పెద్దలు మరియు సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు.ఈ సందర్భంగా గ్రామ పెద్దలు నర్సి కృష్ణ,దిబ్బా కుమారి,కాకర చిన్నారావు,దిబ్బా రత్నకుమారి,కాకర బాలరాజు,గోకిరి చిన్నారావు,రాజ్యలక్ష్మి, కాకర చిన్నమ్ములు తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమంలో రాజేంద్రపాలెం సర్పంచ్ పిట్టల సింహాచలం,కార్యదర్శి మౌనిక కమల,మహిళా పోలీస్ భవాని, మాజీ పీసా ఉపాధ్యక్షుడు కాకర స్వామినాయుడు పాల్గొని,కొత్తగా ఎన్నికైన ఉపాధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.

## తుఫాన్ వల్ల నష్టపోయిన కూరగాయలు రైతులు



**విజయనగరం, పతాకం న్యూస్:** దత్తిరాజేరు మండలం పరిధిలో మరడం గ్రామంలో సుమారు 150 కుటుంబాలు పూర్తిగా కూరగాయలు సాగునే వృతి గా జీవనం సాగిస్తున్నారు. వర్రీ గురుమూర్తి, రాగోలు బంగారి, వర్రీ గణపతి, వర్రీ అప్పారావు, లోచర్ల ఎల్లయ్య, వర్రీ నాగేశ్వరావు, రాగోలు ఈశ్వరరావు, తడివాడ అప్పన్న, మామిడి వెంకటరావులు వీరందరూ మర్రివలస, పాచలవలస, కోరపు కొత్తవలస, వింధ్యావసి, వి కృష్ణాపురం వంటి పలు గ్రామాల్లో సుమారు 150 ఎకరాల్లో ఆకూరలు, కాయగూరలు సాగు చేస్తున్నారు. అకాల వర్షాలు కురవటం వల్ల ఆకుకూరలు, కాయగూరలు పంటలు పూర్తి గా దెబ్బతినడంతో రైతులు లబోదిబో మంటున్నారు. పండించే రైతులు నష్టపోతున్నామంటూ బోరున విలపిస్తున్నారు. యూరియా, ట్రాక్టర్ దుక్కులు రకరకాల ఎరువుల కోసం వేల రూపాయలు ఖర్చు అయ్యింది అని రైతులు అంటున్నారు. కొంతమంది రైతులు వేలల్లో అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టారు. మరి కొంతమంది రైతులు వాళ్ల భార్యల పుస్తులుతాడు బ్యాంకుల్లో తాకట్టు పెట్టి పెట్టుబడి పెట్టారు. కానీ వాతావరణం సహకరించక అధిక వర్షాలు పడటం వల్ల పూత రాలిపోయింది. చేలలో నీరు నిల్వ ఉండడం వల్ల మొక్కలు మొత్తం కుళ్లిపోయి పంట మొత్తం నష్టపోయింది. అందువలన రైతులు పెట్టిన పెట్టుబడికి చేతికి చిల్లిగవ్వ రాలేదు. తాము చేసిన అప్పులు ఎలా తీరుతాయి? తమకు చావే దిక్కు అంటూ రైతులు బోరున రోదిస్తున్నారు. ఈ వర్షాలు కారణంగా నష్టపోతున్నా.. ప్రభుత్వం నుండి ఎలాంటి సహకారం అందించడం లేదంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. దేశానికి అన్నం పెట్టే రైతే రోధిస్తే మన దేశం ఎలా బాగుపడుతుంది ? తగిన నష్టపరిహారం ఇవ్వకపోతే తాము చేసిన అప్పులు ఎలా తీరుతాయి? పండించిన పంటలకు దయచేసి నష్టపరిహారం ఇప్పించవలసిందిగా రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## చందన మోహనరావుకి ఘన నివాళులు



**పతాకం న్యూస్:**ఇటీవల స్వర్గస్తులైన చందన బ్రదర్స్ వ్యవస్థాపకులు వస్త్ర వ్యాపార దిగ్గజం కీ.శే. చందన మోహనరావు కి శ్రద్ధాంజలి ఘటించడం జరిగింది.ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ చేనేత కులాల సంఘం ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో షాపింగ్ మాల్స్ ను ప్రపంచానికి పరిచయం చేశారు అని, ఉత్తమ సంస్కారం, సామాజిక సృహతో నిండిన వ్యాపార దక్షత.కుటుంబ సభ్యులకు అలవర్చిన ఘనత చందన మోహనరావు ది అన్నారు. తెలుగు రాష్ట్రాలకి 916 హాల్ మార్క్ బంగారు ఆభరణాలను పరిచయం చేసిన వ్యక్తిగా, రిటైల్ పరిశ్రమ సరికొత్త పంధానిక ఆద్యులుగా వస్త్ర, బంగారు వ్యాపారములో అనేక ఆవిష్కరణలు తీసుకొచ్చిన ఘనత మోహనరావు కు దక్కిందన్నారు. ఎంతో మంది ఈ రంగాలలో ప్రవేశించడానికి ఆదర్శ ప్రయులుగా లక్షలాది మందికి ఉపాధి కల్పించిన వ్యక్తిగా, దాతృత్వ కార్యక్రమాలు ద్వారా సామాజిక సేవ నైతిక విలువలతో సమర్ధవంతమైన వారసత్వాలని సృష్టించారు.మిత భాషి, మృధుస్వభావి, నిగర్వి, నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శనం చందన మోహనరావు ఆయన మరణం తీరని లోటు అని ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు .ఈ కార్యక్రమములో చేనేత పెద్దలు సీఎంఆర్ షాపింగ్ మాల్ అధినేత మావూరి వెంకట రమణ , ఆంధ్రప్రదేశ్ చేనేత కులాల ప్రధాన కార్యదర్శి పప్పు రాజారావు, ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం పెద్దల కమిటీ చైర్మన్ తేడ్లపు వెంకటేశ్వర్లు , విశాఖ జిల్లా పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి కొప్పుల రామ్ కుమార్,పద్మశాలి ఇంటర్నేషనల్ వెల్ఫేర్ అసోసియేషన్ సెంట్రల్ కమిటీ సభ్యులు చిక్కా సత్యనారాయణ , కరణం వెంకటేశ్వర్లు , గుదే సుశీల గజేంద్ర ,పి.వి.రమణ, వానపల్లి జగ్గారావు ,డా. దుబా రాజు,కట్టా మనోజ్ కుమార్,జక్కా సూర్య ప్రకాష్, దొడ్డి రాజారావు తదితరులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

## జాతీయ జివిఏలో రాష్ట్రం వాటా 7.79 శాతం



**అమరావతి, పతాకం న్యూస్:** జాతీయ జివిఏ (స్థూల విలువ జోడింపు)లో రాష్ట్ర వాటా 7.79 శాతంగా నమోదైంది. ఇతర దక్షిణాది రాష్ట్రాల్లో కన్నా ఆంధ్రప్రదేశ్ మెరుగైన స్థానంలో ఉండడం విశేషం. ప్రాథమిక రంగానికి సంబంధించి తాజాగా నీతి అయోగ్ ప్రకటించిన నివేదికలో దేశంలోని అనేక రాష్ట్రాల జివిఏ వాటాలను వెల్లడించారు. ఈ జాబితాలో ఉత్తరప్రదేశ్ అగ్రస్థానం గా నిలిచింది. అత్యల్ప వాటాను మిజోరామ్ నమోదుచేయగా, ఢిల్లీ కూడా అతి తక్కువగా జాతీయ జివిఏలో వాటా నమోదుచేసిన ట్లు నీతి అయోగ్ వెల్లడించింది. తాజా నివేదికలో ఉత్తర ప్రదేశ్ 11.36 శాతం వాటా కలిగి ఉండగా, మహారాష్ట్ర 10.41 శాతం, రాజస్థాన్ 8.02 శాత 0 మధ్యప్రదేశ్ 7.82 శాతం వాటాలను కలిగి ఉన్నాయి. దక్షిణాది రాష్ట్రాలకు సంబంధించి ఎవి 7.79 శాతం వాటా క లిగి ఉండగా, తమిళనాడు 5.39 శాతం, కర్నాటక 4.54 శాతం, కేరళ 1.66 శాతం, పాండిచ్చేరి 0.05 శాతం వాటా ని జాతీయ జీవిఏలో సాధించాయి. అయితే కేంద్ర పాలిత ప్రాంతం, దేశ రాజధాని ఢిల్లీ కేవలం 0.2 శాతం జివిఏ వా టాతో మాత్రమే ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. మిజోరమ్ 0.1 శాతంతో అట్టడుగు స్థానంలో కొనసాగుతోంది.

ఇక సేవారంగం విభాగంలో జాతీయ జివిఏలో మహారాష్ట్ర వాటా ఏకంగా 15.52 శాతంగా ఉండగా, కర్నాటక 10.47 శాతంగా, తమిళనాడు 8.72 శాతం వాటాతో కొనసాగుతున్నాయి. ఈ విభాగంలో ఆంధ్రప్రదేశ్ కేవలం 3.66 శాతం వాటాను కలిగి ఉండగా, కేరళ 4.44 శాతం వాటాను సాధించింది. మరో తెలుగు రాష్ట్రమైన తెలంగాణ 5.22 శాతం, పాండిచ్చేరి 0.14 శాతం జీవిఏ వాటా కలిగి ఉన్నాయి. అత్యల్పంగా మిజోరామ్ 0.2 శాతం వాటా కలిగి ఉండగా, దేశ రాజధాని ఢిల్లీ 6.05 శాతం వాటాను సాధించింది. జివిఏ వాటా తక్కువగా ఉన్న రాష్ట్రాలు వ్యవసాయం, పరిశ్రమలు వంటి రంగాలపై మరింతగా దృష్టి సారించాలని నీతి అయోగ్ సూచనలు చేసింది. కొన్ని రాష్ట్రాల్లో గతంకన్నా జివిఏ వాటాలు తగ్గిపోతున్నాయని, ఆ విషయాన్ని దృష్టిలో ఉం చుకుని ముందుకు సాగాలని పేర్కొంది. మేఘాలయ, మణిపూర్, నాగాలాండ్ వంటి కొన్ని నార్త్ ఈస్ట్ రాష్ట్రాలు జీవిఏ ఎ టాలో మెరుగవుతున్న విషయాన్ని కూడా ప్రస్తావిస్తూ వాటిని ఇతర రాష్ట్రాలు అధ్యయనం చేయాలని సూచించింది.

## ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌లో విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్



**గుంటూరు, పతాకం న్యూస్:** ప్రభుత్వ యాజమాన్యంలోని షెడ్యూల్డ్ బ్యాంక్ అయిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సమన్వయంతో 2025 విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ వేడుకలో భాగంగా గుంటూరులోని తన ప్రధాన కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు తెలిపింది. ఈ కార్యక్రమాన్ని విజిలెన్స్ ఇన్‌ఛార్జ్ షిన్ హర్ష్ బేతా, ఒఎస్‌డిలు శంకర్ రావు, ఎం. అరుణ్ కుమార్, ఇతర జనరల్ మేనేజర్ల సమక్షంలో బ్లాంక్ చైర్మన్ కె ప్రమోద్ కుమార్ రెడ్డి ఈ శిబిరాన్ని ప్రారంభించారు. స్వయంగా రక్తదానం చేసిన తర్వాత ఛైర్మన్, రక్తదానం అనేది ఒక సేవా కార్యమని, సేవా స్ఫూర్తి ఉన్న చోట అవినీతికి చోటు లేదని నొక్కి చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలు మెరుగైన సమాజాన్ని బలోపేతం చేయడానికి దోహదపడతాయని, విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ లక్ష్యంతో సమానంగా ఉన్నాయన్నారు. ఈ గొప్ప పనిలో ఉత్సాహంగా పాల్గొన్నందుకు బ్యాంక్ యాజమాన్యం, సిబ్బందిని రెడ్ క్రాస్ సొసైటీకి చెందిన రాజు అభినందించారు. హీడ్ ఆఫీస్, ప్రాంతీయ కార్యాలయం, బ్యాంకు స్థానిక శాఖల నుండి 100 మందికి పైగా సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.


## కావేరి బస్సు ప్రమాదం.. డ్రైవర్‌కు రిమాండ్.. పరారీలో యజమాని



**కర్నూలు, పతాకం న్యూస్:** కర్నూలు జిల్లాలో 19 మందిని బలిగొన్న వి.కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాదం కేసులో దర్యాప్తును పోలీసులు వేగవంతం చేశారు. ఈ ఘటనలో ప్రధాన నిందితుడిగా ఉన్న బస్సు డ్రైవర్ మిరియాల లక్ష్మయ్యను మంగళవారం అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. న్యాయస్థానం అతనికి రిమాండ్ విధించింది. మరోవైపు, బస్సు యజమాని వి.వినోదకుమార్ పరారీలో ఉన్నారని, అతని ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని పోలీసులు తెలిపారు. ఈ నెల 24వ తేదీ అర్ధరాత్రి దాటిన తర్వాత చిన్న టేకూరు వద్ద ఈ ఘోర దుర్ఘటన జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై కల్లూరు మండలం ఉల్లిందకొండ పోలీస్ స్టేషన్‌లో బస్సు డ్రైవర్, యజమానిపై కేసు నమోదైంది. పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య పర్యవేక్షణలో కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబునాయుడు, ఉల్లిందకొండ ఎస్ఐ ధనుంజయ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ఈ కేసులో సాంకేతిక నివేదికలు అత్యంత కీలకం కానున్నాయి. ప్రమాదానికి గల కారణాలను నిర్ధారించేందుకు రోడ్డు రవాణా శాఖ (ఆర్టీఏ), అగ్నిమాపక శాఖల నుంచి నివేదికలు కోరుతూ అధికారులు లేఖలు రాశారు. ఇప్పటికే విజయవాడ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్) నుంచి నివేదిక అందినట్లు సమాచారం. మిగిలిన రెండు శాఖల నుంచి నివేదికలు రాగానే, పక్కా ఆధారాలతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. పరారీలో ఉన్న యజమాని వినోదకుమార్‌ను వీలైనంత త్వరగా పట్టుకుని కోర్టులో హాజరుపరుస్తామని దర్యాప్తు అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. నివేదికలు అందిన తర్వాత ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై పూర్తి స్పష్టత వస్తుందని భావిస్తున్నారు.

# గుహలను తలపించే సంక్షేమ హాస్టళ్లు?





**కడప, పతాకం న్యూస్:** సమాజంలోని అట్టడుగు వర్గాలకు చెందిన నిరుపేద విద్యార్థులకు ఆవాసాలైన సంక్షేమ హాస్టళ్లు అంధకార బంధురమైన గుహలను తలపిస్తున్నాయి. ఉమ్మడి కడప జిల్లాలోని పోరుమామిళ్ల ఎస్‌టి రెసిడెన్షియల్ హాస్టల్, రాజంపేట ఎస్‌సి హాస్టల్ శిథిలావస్థకు చేరుకున్నాయి. ఈ రెండు హాస్టళ్లతోపాటు ఒంటిమిట్ట ఎస్‌టి హాస్టల్ కూడా చిన్నపాటి వర్షానికే కారిపోతోంది. రాజంపేట హాస్టల్ గాంధాంధకారంతో కూడిన గుహలను తలపిస్తోంది. ఫ్లోరింగ్ అధ్వానంగా ఉంది. స్లాబులు, గోడలు పెచ్చులూడుతున్నాయి. స్లాబు నుంచి ఎర్రటి ఛారలు కలిగిన సహస్ర పాదపురుగులు కిందపడుతున్నాయి. మరుగుదొడ్లు దుర్వాసన వస్తున్నాయి. కిటికీల మెష్‌లు పాడైపోయాయి. దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. వెరసి క్షణం కూడా ఉండలేని పరిస్థితి ఉంది. పలు హాస్టళ్లను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతుంది.. ఉమ్మడి జిల్లాలో 66 సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, 11 ఎస్‌టి హాస్టళ్లు, ఎనిమిది ఎస్‌టి హాస్టళ్లు, 24 గురుకుల హాస్టళ్లు, 17 కెజిబివి హాస్టళ్లు ఉన్నాయి. 42,752 మంది విద్యార్థులు వీటిలో ఉంటున్నారు. పోరుమామిళ్ల హాస్టల్‌లో 65 మంది, ఒంటిమిట్ట హాస్టల్‌లో 42 మంది, రాజంపేట హాస్టల్‌లో 43 మంది ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారు. రాజంపేట హాస్టల్ తలుపులు విరిగిపోయాయి. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. పైకప్పుకు వేసిన రేకులు కొన్ని చోట్ల విరిగిపోయాయి. స్నానపు కుళాయిలు పనిచేయడం లేదు.

పోరుమామిళ్ల, రాజంపేట హాస్టళ్లు శిథిలావస్థకు చేరాయి. గత ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఈ భవనాలు కూలిపోతాయేమోననే భయం నెలకొంది. పోరుమామిళ్ల రెసిడెన్షియల్ హాస్టల్ విద్యార్థులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పైఅంతస్తులో తలదాచుకుంటున్నారు. రాజంపేట హాస్టల్ విద్యార్థులు ఇళ్లకు వెళ్లి రావాల్సిన దుస్థితి నెలకొంది. హాస్టల్ పరిసరాల్లో వర్షపు నీరు నిల్చిపోవడం, చిత్తడితో కూడిన రొచ్చు వల్ల దోమల బెడద అధికంగా ఉంది. 2005లో నిర్మితమైన ఒంటిమిట్ట హాస్టల్ భవనం గోడలనుంచి వర్షపు నీటి లీక్ అవుతుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

నందలూరు ఎస్‌సి హాస్టల్‌లోని ఆర్‌ఓ ప్లాంట్ మరమ్మతులకు గురికావడంతో క్యాన్ల ద్వారా తాగునీరు తెప్పించుకుంటున్నారు. దీంతో, బాగా పొదుపుగా వాడుకోవాల్సివస్తోంది. బెడ్‌షీట్లు లేకపోవడంతో ఇంటి దగ్గర నుంచి తెప్పించుకుని వాడుకుంటున్నామని విద్యార్థులు తెలిపారు. ఈ హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు అందలేదు.

దీనిపై వార్డెన్‌ను ఆరాతీయగా రాజంపేటలోని ఉన్నతాధికారి కార్యాలయానికి విద్యార్థుల వివరాలు పంపామని, విద్యార్థుల ఖాతాల్లో జమైందీ లేనిదీ తెలియదని తెలిపారు. పోరుమామిళ్ల, రాజంపేట హాస్టళ్ల భవన నిర్మాణానికి రూ.62 లక్షల చొప్పున కేటాయిస్తున్నామని అధికారులు ఏడాది కిందటి నుంచి చెప్తున్నా ఆచరణకు నోచుకోలేదు. తాజాగా కేంద్రం నుంచి పిఎం అజరు స్కీమ్ కింద రూ.మూడు కోట్ల వరకు మంజూరయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇప్పటికైనా ఈ హాస్టళ్లకు కొత్త భవన నిర్మాణాలు నిర్మించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

## కాకినాడ అనుకుంటే నరసాపురం.. అంచనాలకు అందని 'మొంథా'



**నరసాపురం, పతాకం న్యూస్:** మొంథా తుపాను అంచనాలను తలకిందులు చేస్తూ, వాతావరణ శాఖ అధికారులను సైతం గందరగోళానికి గురిచేస్తూ చివరకు నరసాపురం సమీపంలో తీరం దాటింది. ఇది మిగిలిన తుపానులతో పోలిస్తే చాలా భిన్నమైనదని వాతావరణ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. తుపాను తీరం దాటే ప్రాంతంపై చివరి వరకు స్పష్టత లేకపోవడం దీని విలక్షణతకు అద్దం పడుతోంది.గత మూడు రోజులుగా కాకినాడకు దక్షిణంగా తుపాను తీరం దాటుతుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. అయితే, బుధవారం నాటికి అంచనాలు మారి హంసలదీవి, అంతర్వేదిపాలెం వద్ద తీరాన్ని తాకే అవకాశం ఉందని ప్రచారం జరిగింది. చివరకు పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలోని వాతావరణ పరిశీలన కేంద్రంలో నమోదైన గాలుల వేగం, వాతావరణ పీడనం ఆధారంగా.. తుపాను అక్కడికి సమీపంలోనే తీరం దాటినట్లు అధికారులు అధికారికంగా ప్రకటించారు.తుపాను ప్రవర్తన కూడా అసాధారణంగా ఉంది. దీని పశ్చిమ భాగం మంగళవారం ఉదయమే నెల్లూరు జిల్లాను తాకడంతో అక్కడ భారీ వర్షాలు కురిశాయి. ఆ తర్వాత ప్రకాశం, గుంటూరు జిల్లాల్లోనూ అధిక వర్షపాతం నమోదైంది. మరోవైపు, తుఫాను ఉత్తర భాగంలోని మేఘాల ప్రభావంతో ఆదివారం రాత్రి నుంచే ఉత్తరాంధ్రలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయని వాతావరణ అధికారి జగన్నాథకుమార్ తెలిపారు. అయితే, తీరం దాటే సమయంలో ఉత్తరాంధ్రలో వర్షాలు తక్కువగా ఉన్నాయని ఆయన వివరించారు.

ఈ విచిత్రమైన పరిస్థితిపై జగన్నాథకుమార్ మాట్లాడుతూ, "వాతావరణంలో మార్పుల వల్లే ఇలా జరిగిందని కచ్చితంగా చెప్పలేం. తుఫాను తూర్పు భాగం విచ్ఛిన్నమై, పశ్చిమ భాగంలో నీటి మేఘాలు ఎక్కువగా కేంద్రీకృతం కావడం వల్లే ఇది నరసాపురం వైపు కదిలింది. ఒకవేళ తూర్పు భాగంలో 'విండ్ షీర్' బలంగా లేకపోయి ఉంటే, అది మొదట అంచనా వేసినట్లు కాకినాడ వైపే వచ్చి ఉండేది" అని విశ్లేషించారు. మొత్తంమీద మొంథా తన గమనాన్ని మార్చుకుంటూ అధికారులను ముప్పుతిప్పలు పెట్టింది.

## బస్సు ప్రమాద ఘటన మృతదేహాలు అప్పగింత

**నెల్లూరు, పతాకం న్యూస్:** శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సంగం పెన్నా నది బ్యారేజి వద్ద భారీ ప్రమాదం తప్పింది. దీనికి సంబంధించిన వివరాలను విపత్తుల నిర్వహణ సంస్థ సోషల్ మీడియా వేదికగా పోస్టు చేసింది. పోస్టులో%‰% ఇసుక సేకరణకు ఉపయోగించే మూడు పడవలు వరద ప్రవాహంలో కొట్టుకువచ్చి బ్యారేజి వైపు దూసుకువెళ్లాయి. అయితే వాటిని ఎన్డీఆర్ఎఫ్ బృందం సమయానికి నియంత్రించడం వల్ల పెనుప్రమాదం తప్పింది. జిల్లా కలెక్టర్ హిమాంశు శుక్లా, ఎస్పీ అజిత వేజెండ్లతో పాటు ఇతర అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షిస్తూ ప్రమాదాన్ని తప్పించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందం కొట్టుకువచ్చిన పడవలను నియంత్రించకపోతే బ్యారేజి వద్ద భారీ విధ్వంసం జరిగి ఉండేది. లోతట్టు ప్రాంతాలు భారీ ముంపునకు గురైయ్యేవి. ఈ సంఘటనతో మరోసారి అందరికీ 2024 బుడమేరు వరదల్లో ప్రకాశం బ్యారేజి ఘటన గుర్తుకొచ్చింది.

వరద ఉద్ధృతికి వంతెన రైలింగుకు కట్టేసిన పడవల తాళ్లు తెగిపోయాయి. దీంతో ఆ పడవలు ఆనకట్ట వైపు వేగంగా కొట్టుకువచ్చాయి.

వాటిలో ఒక పడవను ఇసుక రేవు ప్రాంతానికి, మరొకదాన్ని కనిగిరి జలాశయం ప్రధాన రెగ్యులేటర్ వద్దకు చేర్చగలిగారు. మరో పడవ మాత్రం బ్యారేజి ఎగువన సుమారు 400 మీటర్ల దూరంలో ఉన్న పాత ఆనకట్ట క్రెస్ట్ వద్ద నిలిచిపోయింది. ఒక వేళ ఆ బోట్లు అంతే వేగంగా వచ్చి సంఘం బ్యారేజి గేట్లను ఢీ కొట్టి ఉంటే విధ్వంసం జరిగి ఉండేది.



బోటు బరువు 35 టన్నులు ఉండడంతో బయటికి తరలించేందుకు ఇబ్బందులు పడ్డారు. బోటును బయటికి తీసేందుకు ఎన్డీఆర్ఎఫ్ స్విమ్మర్స్ మరియు బృందం సభ్యులు సూమారు 12 గంటల పాటు శ్రమించి మూడు భారీ బోట్లు, తాళ్ళ సహాయంతో బోటును రెండు వైపుల కట్టి లంగర్ తో లాక్ చేశారు. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ క్లిష్టతరమైన సాహసానికి ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని కలెక్టర్ అభినందించారు.

# బాల్యంలో పోషకాహారం లోపిస్తే ఏం జరుగుతుందో తెలుసా?



మొక్కకు నీరు పోసి సంరక్షిస్తేనే వృక్షంగా ఎదుగుతుంది. పంటకు నీటితో పాటు సరైన మోతాదులో ఎరువు వేస్తేనే మంచి దిగుబడి వస్తుంది. ఇది పిల్లలకూ కూడా వర్తిస్తుంది. పసిపిల్లలు ఆరోగ్యంగా ఉంటూ, ఎత్తుకు తగ్గ బరువు పెరగాలంటే పోషకాహారం తప్పనిసరి. ఎదిగే వయసులో పిల్లలు అనారోగ్యం బారిన పడకుండా ఉండాలంటే తల్లిదండ్రులు సమతుల ఆహారం అందించాలంటున్నారు నిపుణులు. కానీ, చాలామంది పేదరికం, నిరక్షరాస్యత, అవగాహన లేమి తదితర కారణాలతో పిల్లలకు పోషకాహారం ఇవ్వలేకపోతున్నారని వివరిస్తున్నారు. దీంతో చిన్నారులు వయసుకు తగ్గ ఎత్తు, బరువు ఉండటం లేదని తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో పిల్లల ఎదుగుదలకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం!

చిన్నారుల ఆరోగ్యాన్ని అత్యంత జాగ్రత్తగా చూసుకోవాలి. మొదటి ఆరేళ్లలోపు వారి శారీరక, మానసిక, సామాజిక ఎదుగుదలపై దృష్టిపెట్టాలంటున్నారు నిపుణులు. కానీ, పోషకాహారం లోపం వీరి పాలిట శాపంగా మారుతోందని చెబుతున్నారు. పిల్లల సమగ్ర ఎదుగుదలకు అవరోధంగా ఉన్న సవాళ్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ కేంద్ర గణాంకాలు, పథకాల అమలు శాఖ తాజాగా 'చిల్డ్రన్ ఇన్ ఇండియా 2025' పేరుతో ఓ నివేదిక విడుదల చేసింది.

కన్నీటి గుర్తులు : పోషకాహార లోపంతో పిల్లలకు విటమిన్లు, ప్రొటీన్లు, మినరల్స్ తగినంతగా అందట్లేదు. 35.5 శాతం పిల్లల్లో పెరుగుదల లోపాలున్నాయి. ఈ సమస్య అనేది గ్రామీణ ప్రాంతాల్లో 37.3 శాతం, పట్టణ ప్రాంతాల్లో 30.1 శాతం మందిలో ఉంటోంది. మేఘాలయ రాష్ట్రంలో అత్యధికంగా 46.5 శాతం పిల్లలు ఈ లోపంలో బాధపడుతున్నారని ఈ నివేదికలో పేర్కొంది.

ఎత్తుకు తగ్గ బరువు లోని పిల్లలు దేశ వ్యాప్తంగా 19.3 శాతం ఉన్నారు. ఈ తీవ్రత మహారాష్ట్రలో ఎక్కువగా ఉంది. 10-14 ఏళ్లలోపు పిల్లల్లో డి విటమిన్ లోపం 23.9 శాతం, జింక్ లోపం 31.7 శాతం మందిలో ఉంది. 10-19 ఏళ్ల పిల్లల్లో మధుమేహానికి ప్రీ డయాబెటిక్ 10.4 శాతం ఉండగా, ఇప్పటికే డయాబెటిస్ ఉన్నవారు 0.6 శాతం మంది ఉన్నారు. రక్తంలో అధిక కొవ్వు 3.7 శాతం మందికి, రక్తపోటు 4.9 శాతం మందికి ఉంటోంది.

పిల్లల సమగ్ర ఎదుగుదలకు తల్లిపాలే పరమౌషధం. పుట్టిన 1 గంటలోపు తల్లిపాలు ఇవ్వడం ప్రారంభిస్తే, నవజాత శిశువుకు ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడుతుందని, నవజాత శిశువుల మరణాలను తగ్గిస్తుందని అధ్య యనం పేర్కొంది. పిల్లలకు 6 నెలలు ప్రత్యేకంగా తల్లిపాలు ఇవ్వడం వల్ల శిశువు, తల్లికి అనేక ప్రయోజనాలు ఉన్నాయని తెలిపింది. తర్వాత రెండేళ్ల వయసొచ్చేవరకు తగిన ఆహారం తినిపిస్తే పిల్లల్లో శక్తి, ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్?తో పాటు రోగనిరోధక శక్తి పెరుగుతుందని చిల్డ్రన్ ఇన్ ఇండియా 2025 నివేదిక చెప్పింది. తల్లిపాలే శిశువుకు తొలి వ్యాక్సిన్?గా పనిచేస్తాయని పేర్కొంది.

అయోడైజ్డ్ ఉప్పుతో : అయోడిన్ ఉప్పు వాడితే పిల్లలకు సూక్ష్మపోషకాలు చేరడంతో పాటు, థైరాయిడ్ సమస్య తలెత్తదని నివేదిక తెలిపింది. ప్రత్యేకించి అయోడిన్ లోపాలున్న పిల్లలు అత్యధికంగా దేశంలో ఏపీలోనే 82.5 శాతం ఉన్నట్లు పేర్కొంది.

సూక్ష్మపోషకాలు అవసరం : పిల్లల శరీరానికి విటమిన్లు, మినరల్స్ అవసరం చాలా తక్కువ. అవి కూడా అందక ఆరోగ్య సమస్యలు, మరణాలు సంభవిస్తున్నాయి. తీసుకునే ఆహా రంలో ఐరన్, విటమిన్ ఎ ఉండేలా చూసు కోవాలంటున్నారు నిపుణులు. ఇవి దృష్టిలోపం, అనీమియా నుంచి కాపాడతాయని చెబుతున్నారు.

టీకాలతో రక్ష : వ్యాధుల నుంచి చిన్నారులను సంరక్షించేందుకు టీకాలు వేయించడం తప్పనిసరి. కనీసంగా ఒక డోస్ బీసీజీ, మూడు డోస్?ల డీపీటీ, 3 డోస్ల పోలియో, ఒక డోస్ మీజిల్స్ వ్యాక్సిన్లు తప్పనిసరని కేంద్రం సూచిస్తుంది.

# తెల్ల జుట్టు నల్లగా మారాలని ఉందా?





తెల్ల జుట్టు వచ్చిందన్న బాధ చాలా మందిలో ఉంటుంది. పక్కవారు ఏమనుకుంటున్నారో అన్న వేధన ఉంటుంది. ఇక తెల్ల జుట్టును నల్లగా మార్చడానికి హెన్నా, వివిధ రకాల షాంపూలు, ఖరీదైన డైలు వాడతారు.

దుమ్ము, కాలుష్యం కారణంగా మన జుట్టు పొడిగా, నిర్జీవంగా మారుతుంది. అంతే కాకుండా.. తెల్ల జుట్టు, తలపై వెంట్రుకలు రాలి పోవడం వంటి అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఉరుకుల పరుగుల జీవితం, పొల్యూషన్, మనం తినే ఆహారం కారణగా చిన్న వయసులోనే చాలా మంది జుట్టు సమస్యలతో సతమతమవుతున్నారు. ఇలాంటి సమయాల్లో ఖరీదైన షాంపూలు, కండిషనర్లు సీరమ్‌లు వాడుతుంటాం. ఇక, తెల్ల జుట్టు గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. సాధారణంగా తెల్ల జుట్టు వృద్ధాప్యానికి సంకేతం. కానీ, చాలా మంది చిన్న వయసులోనే ఈ సమస్యతో బాధపడుతున్నారు.

ఇక, తెల్ల జుట్టు వచ్చిందన్న బాధ చాలా మందిలో ఉంటుంది. పక్కవారు ఏమనుకుంటున్నారో అన్న వేధన ఉంటుంది. ఇక తెల్ల జుట్టును నల్లగా మార్చడానికి హెన్నా, వివిధ రకాల షాంపూలు, ఖరీదైన డైలు వాడుతున్నారు. వెంట్రుకలు నల్లబడటానికి హెన్నా వాడకం శాశ్వత పరిష్కారం కానప్పటికీ, జుట్టు యొక్క తెల్లదనాన్ని కొంతకాలం దాస్తుంది. అయితే, మనలో చాలా మంది హెన్నా వేసి వేసి విసిగి చెంది ఉంటారు. అయితే, అలాంటి వారి కోసమే హెన్నా లేకుండా జుట్టును నల్లగా మార్చడంలో సహాయపడే కొన్ని రెమెడీల ముందుకు తీసుకు వచ్చాం. ఉసిరిలో విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, అవసరమైన కొవ్వు ఆమ్లాలు, వివిధ పోషకాలు మెండుగా ఉంటాయి. ఇవి జుట్టుకు పోషణ, బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఆయుర్వేద నిపుణుల ప్రకారం జుట్టు రాలే సమస్యను తగ్గించడంలో ఉసిరి ఎంతో మేలు చేస్తుంది. జుట్టు రాలడాన్ని తగ్గించడమే కాకుండా.. వెంట్రుకలు తెల్లబడకుండా ఉసిరి మెరుగ్గా పనిచేస్తుందట. వాడే పద్ధతి..ఉసిరి నూనెతో తలకు క్రమం తప్పకుండా మసాజ్ చేయండి. ఉసిరి పొడిని నీటిలో కలిపి పేస్ట్‌లా చేసి జుట్టుకు పట్టించాలి. ఉసిరి రసం తాగడం వల్ల జుట్టుకు మేలు జరుగుతుంది. కరివేపాకులో యాంటీ ఆక్సిడెంట్లు, బీటా కెరోటిన్ పుష్కలంగా ఉంటాయి. ఇవి జుట్టుకు బలాన్ని ఇస్తాయి. కరివేపాకు తీసుకోవడం వల్ల జుట్టు రాలడం, నెరిసే ప్రక్రియ నెమ్మదిస్తుంది.

వాడే పద్ధతి..కొబ్బరినూనెలో కరివేపాకును మరిగించాలి. ఆ తర్వాత వడగట్టి నూనె చల్లారనివ్వాలి. ఈ నూనెతో జుట్టుకు మసాజ్ చేయండి. ఇలా వారానికి రెండు మూడు సార్లు ఉపయోగిస్తే మంచి ఫలితాలు పొందవచ్చు. ఉల్లి రసం లేదా, ఉల్లి నూనె వల్ల కలిగే ప్రయోజనాలు గురించి మనకు ఇప్పటికే తెలుసు. జుట్టు, చర్మ రక్షణలో ఇవి ఎంతగానో ఉపయోగపడతాయి. ఉల్లిపాయ రసంలో అధిక మొత్తంలో సల్ఫర్ ఉంటుంది. ఇది జుట్టు మూలాలను పోషించడంలో, తెల్ల జుట్టును నల్లగా మార్చడంలో సాయపడుతుంది. వాడే పద్ధతి..తాజా ఉల్లిపాయను గ్రైండ్ చేసి దాని రసాన్ని తీయండి. ఈ రసాన్ని తలకు పట్టించి 30 నిమిషాల పాటు అలాగే ఉంచాలి. దీని తర్వాత తేలికపాటి షాంపూతో జుట్టును శుభ్రపర్చుకోవాలి. వారానికి రెండు మూడు సార్లు ఇలా చేస్తే మంచి ఫలితాలుంటాయని నిపుణులు చెబుతున్నారు. తెల్ల జుట్టును నల్లగా మార్చే గ్రేట్ హోం రెమెడీగా బ్లాక్ టీని పిలుస్తారు. బ్లాక్ టీ జుట్టుకు సహజమైన రంగును అందిస్తుంది. జుట్టుకు మెరుపును కూడా అందిస్తుంది.

## పాడేరు మొదలుకుని అన్ని మండలాల్లోనూ

# మొంథా తుఫాన్ ప్రభావం



**పాడేరు, పతాకం న్యూస్:** మొంథా తుఫాన్ ప్రభావంతో జిల్లాలో ఈదురు గాలులతో కూడిన కుండపోత వర్షం కురిసింది. అరకులోయ, పాడేరు ఘాట్ మార్గాల్లో మట్టి పెళ్లలు విరిగిపడగా, చెట్లు సైతం రోడ్డుకు అడ్డంగా నేలకొరిగాయి. తక్షణమే స్పందించిన ప్రత్యేక బృందాలు హుటాహుటిన సహాయక చర్యలు చేపట్టి, వాటిని తొలగించారు. వరద నీటితో అనేక ప్రాంతాల్లో పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. గెడ్డలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

జిల్లా కేంద్రం పాడేరు మొదలుకుని అన్ని మండలాల్లోనూ తుఫాన్ ప్రభావం కనిపించింది. అయితే అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ, హుకుంపేట మండలాల్లో అధిక ప్రభావం చూపింది. భారీ వర్షాలకు పాడేరు, జి.మాడుగుల మండలాల్లోని మత్స్యగెడ్డ ఉగ్రరూపం దాల్చింది. దీంతో మండలంలో రాయిగెడ్డ కాజ్‌వే పైనుంచి మత్స్యగెడ్డ వరద నీరు ప్రవహిస్తున్నది. పాడేరు మండలంలోని మత్స్యగెడ్డ, రాయిగెడ్డ, చిలకలమామిడి గెడ్డ, పాడేరు, పెదబయలు మండలాలకు సరిహద్దున ఉన్న పరదానిపుట్టు గెడ్డ, జి.మాడుగుల మండలంలోని కోడిమామిడి గెడ్డ, మత్స్యగెడ్డ, ముంచంగిపుట్టు మండలంలో బూసిపుట్టు, లక్ష్మీపురం, రంగబయలు ప్రాంతాల్లోని గెడ్డలు, డుంబ్రిగుడలోని చాపరాయిగెడ్డ, సంపంగిగెడ్డ, లోచలిగెడ్డ, హుకుంపేట మండలంలో రాళ్లగెడ్డ, లివిటి గెడ్డలు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో జనం రాకపోకలు సాగించకుండా రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో ఏర్పాటు చేసిన బృందాలను గస్తీగా పెట్టారు. ఎక్కడికక్కడ సహాయక చర్యలను చేపట్టేందుకు రోడ్లు, భవనాల శాఖ, రెవెన్యూ, పోలీసు సిబ్బందితో సిద్ధం చేసిన ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగడంతో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు అవకాశం కలిగింది. మొంథా తుఫాన్‌పై అధికార యంత్రాంగం ముందస్తుగా అవసరమైన అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టడంతో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు సంభవించలేదని అధికారులు తెలిపారు.

తుఫాన్ తీరం దాటే క్రమంలో జిల్లాలోభారీ వర్షాలు కురవడంతో అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ, హుకుంపేట మండలాలతో పాటు పాడేరు, జి.మాడుగుల, కొయ్యూరు మండలాల్లో సైతం గెడ్డలు ఉగ్రరూపం దాల్చాయి. అలాగే అరకులోయ ఘాట్‌లో కొండ పైనుంచి రోడ్డుపై వరద నీరు, మట్టి పెళ్లలు విరిగిపడ్డాయి. కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్, ఎస్‌సీ అమిత్‌బర్దార్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను స్వయంగా సందర్శించి సహాయక చర్యలను మరింత ముమ్మరం చేశారు. దీంతో ఎక్కడా ఎవరికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో సహాయక చర్యలు చేపట్టారు.

చింతపల్లి మండలంలో ఆరు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. జి.మాడుగుల మండలం సొలభం ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. పాలమామిడి పంచాయతీ వనభంగిపాడు గ్రామంలో భారీ చింత చెట్టు ఓ ఇంటిపై కూలిపోయింది. కొత్తపల్లి జలపాతం ఉధృతంగా ప్రవహిస్తోంది. అరకులోయ మండలంలోని ఇరగాయి గ్రామంలో శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం నేలమట్టమైంది. అనంతగిరి మండలంలో వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. డముకు-నిమ్మలపాడు రోడ్డులోని డముకు సమీపంలో కాజ్‌వే పైనుంచి వరద నీరు ప్రవహించడంతో పెదబిడ్డ, గుమ్మ, లంగుపర్తి, నిమ్మలపాడు పంచాయతీలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తాటిగుడ జలపాతానికి వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక కల్వర్టు కొట్టుకుపోయింది. డుంబ్రిగుడ మండలంలోని పోతంగి పంచాయతీ వంతర్డ గ్రామంలో శిథిలావస్థలో ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం నేలమట్టమైంది. హుకుంపేట మండలంలో చీడిపుట్టు కాజ్‌వే పైనుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

## రూ. 143 లక్షల కోట్లను దాటిన

# యూపీఐ లావాదేవీలు




భారత డిజిటల్ చెల్లింపుల రంగంలో యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తోంది. 2025 మొదటి అర్ధభాగంలో యూపీఐ లావాదేవీల సంఖ్య గతేడాదితో పోలిస్తే 35 శాతం పెరిగి 106.36 బిలియన్లకు చేరింది. ఈ లావాదేవీల మొత్తం విలువ రూ. 143.34 లక్షల కోట్లుగా నమోదైంది. దేశంలో డిజిటల్ చెల్లింపులు ప్రజల దైనందిన జీవితంలో ఎంతగా భాగమయ్యాయో ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ వివరాలను 'వరల్డ్‌లైన్' సంస్థ తన 'ఇండియా డిజిటల్ పేమెంట్స్ రిపోర్ట్ 'లో బుధవారం వెల్లడించింది.నివేదిక ప్రకారం యూపీఐ ద్వారా జరిగే సగటు లావాదేవీ విలువ తగ్గడం గమనార్హం. 2024 ప్రథమార్ధంలో సగటున రూ. 1,478గా ఉన్న లావాదేవీ విలువ, 2025 ఇదే కాలంలో రూ. 1,348కి తగ్గింది. టీ కొట్టు, కిరాణా దుకాణం నుంచి ఆన్‌లైన్ షాపింగ్ వరకు చిన్న చిన్న, రోజువారీ కొనుగోళ్లకు ప్రజలు యూపీఐని ఎక్కువగా ఉపయోగిస్తున్నారని ఇది సూచిస్తోంది.ముఖ్యంగా వ్యక్తి నుంచి వ్యాపారికి చేసే లావాదేవీలు 37 శాతం వృద్ధితో 67.01 బిలియన్లకు చేరాయి. దీనికి 'కిరాణా ఎఫెక్ట్' కారణమని వరల్డ్‌లైన్ పేర్కొంది. దేశంలోని చిన్న, సూక్ష్మ వ్యాపారాలు డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారాయని నివేదిక తెలిపింది. ప్రభుత్వ ప్రోత్సాహకాలతో భారత్‌లో ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద మర్చంట్ నెట్‌వర్క్ ఏర్పడింది.ఈ వృద్ధికి అనుగుణంగా చెల్లింపుల మౌలిక సదుపాయాలు కూడా భారీగా పెరిగాయి. దేశంలో క్యూఆర్ కోడ్‌ల సంఖ్య 2024 జనవరితో పోలిస్తే 111 శాతం పెరిగి 2025 జూన్ నాటికి 678 మిలియన్లకు చేరింది. అలాగే, పాయింట్-ఆఫ్-సేల్ (పీఓఎస్) టెర్మినళ్ల సంఖ్య 29 శాతం వృద్ధితో 11.2 మిలియన్లకు చేరుకుంది.మరోవైపు క్రెడిట్ కార్డుల వాడకం ప్రీమియం ఖర్చులకు సాధనంగా మారుతోంది. యాక్టివ్ క్రెడిట్ కార్డుల సంఖ్య 23 శాతం పెరిగింది. అయితే, చిన్న చెల్లింపులు యూపీఐ వైపు మళ్లడంతో పీఓఎస్ వద్ద డెబిట్ కార్డుల వాడకం దాదాపు 8 శాతం తగ్గింది. మొత్తం మీద మొబైల్ చెల్లింపులు 30 శాతం వృద్ధితో 98.9 బిలియన్ల లావాదేవీలను నమోదు చేశాయి.




## మహిళల వరల్డ్ కప్

# ఫైనల్లో దక్షిణాఫ్రికా



ఐసీసీ మహిళల ప్రపంచకప్ 2025లో దక్షిణాఫ్రికా జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. మొదటి సెమీఫైనల్లో ఇంగ్లండ్‌పై 125 పరుగుల భారీ తేడాతో సంచలన విజయం సాధించింది. కెప్టెన్ లారా వోల్వార్ట్ (169) అద్భుత శతకంతో చెలరేగగా, బౌలింగ్‌లో మరిజానే కాప్ (5/20) ఐదు వికెట్లతో ఇంగ్లండ్ పతనాన్ని శాసించింది. ఈ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో సఫారీ జట్టు తొలిసారిగా వరల్డ్ కప్ టైటిల్ పోరుకు అర్హత సాధించింది.

గౌహతిలోని బర్సపరా స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికాకు కెప్టెన్ లారా వోల్వార్ట్ అసాధారణ ఇన్నింగ్స్‌తో భారీ స్కోరు అందించింది. కేవలం 143 బంతుల్లో 20 ఫోర్లు, 4 సిక్సర్లతో 169 పరుగులు చేసి ఇంగ్లండ్ బౌలర్లను ఉతికి ఆరేసింది. మరో ఓపెనర్ తాజ్మిన్ బ్రిట్స్ (45), మరిజానే కాప్ (42), క్లో ట్రయాన్ (33లి) రాణించడంతో దక్షిణాఫ్రికా నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 319 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇంగ్లండ్ బౌలర్లలో సోఫీ ఎక్లెస్టోన్ 4 వికెట్లు పడగొట్టింది.

320 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లండ్‌కు ఆరంభంలోనే కోలుకోలేని దెబ్బ తగిలింది. కేవలం ఒక పరుగుకే మూడు కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఓపెనర్లు అమీ జోన్స్, టామీ బ్యూమాంట్, హీథర్ నైట్ డకౌట్‌గా వెనుదిరిగారు. ఈ దశలో కెప్టెన్ నాట్ సీవర్-బ్రంట్ (64), అలిస్ క్యాప్సీ (50) అర్ధ సెంచరీలతో జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 107 పరుగులు జోడించి ఆశలు రేపారు.

అయితే ఈ జోడీ విడిపోయాక ఇంగ్లండ్ ఇన్నింగ్స్ పేకమేడలా కూలిపోయింది. మరిజానే కాప్ తన అద్భుతమైన బౌలింగ్‌తో మిడిలార్డర్‌ను కుప్పకూల్చింది. కేవలం 7 ఓవర్లలో 20 పరుగులిచ్చి 5 వికెట్లు తీసి ఇంగ్లండ్ ఓటమిని ఖాయం చేసింది. దీంతో ఇంగ్లండ్ జట్టు 42.3 ఓవర్లలో 194 పరుగులకే ఆలౌట్ అయి టోర్నీ నుంచి నిష్క్రమించింది. ఈ అద్భుత విజయంతో దక్షిణాఫ్రికా ప్రపంచకప్ ఫైనల్లో అడుగుపెట్టింది.

# టీమిండియాకు 339 పరుగుల భారీ టార్గెట్



మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా రెండో సెమీ ఫైనల్‌లో టీమిండియా-ఆస్ట్రేలియా తలపడుతున్నాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్ 49.5 ఓవర్లలో 338 పరుగులు చేసి ఆలౌటైంది. దీంతో టీమిండియాకు 339 పరుగుల భారీ టార్గెట్‌ను ఆసీస్ నిర్దేశించింది. మహిళల వన్డే ప్రపంచ కప్‌లో భాగంగా రెండో సెమీ ఫైనల్‌లో టీమిండియా-ఆస్ట్రేలియా తలపడుతున్నాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఆసీస్ 49.5 ఓవర్లలో 338 పరుగులు చేసి ఆలౌటైంది. దీంతో టీమిండియాకు 339 పరుగుల భారీ టార్గెట్‌ను నిర్దేశించింది. ఓపెనర్ లీచ్ ఫీల్డ్(119) సూపర్ సెంచరీతో అదరగొట్టింది. లీచ్ కేవలం 93 బంతుల్లో 17 ఫోర్లు, 3 సిక్స్‌ల సాయంతో 119 పరుగులు చేసింది. ఎలీస్ పెర్రీ(77) హాఫ్ సెంచరీతో రాణించింది. ఆష్లీన్ గార్డ్‌నర్(63) చివర్లో మెరుపులు మెరిపించింది. బెత్ మూనీ(24), కిమ్ గార్త్(17),తాహిలా మెక్‌గ్రాత్(12) పరుగులు చేశారు. భారత బౌలర్లలో శ్రీ చరణి 2, దీప్తి శర్మ 2, క్రాంతి గౌడ్, అమన్‌జ్యోత్ కౌర్, రాధా యాదవ్ తలో వికెట్ పడగొట్టారు.

దూకుడుగా ఆడుతున్న ఆసీస్ బ్యాటర్లను భారత బౌలర్లు కట్టడి చేయడంలో విఫలమయ్యారు. దీని వల్ల ఆసీస్ 338 భారీ పరుగులు చేయగలిగింది.




## గ్లామర్ క్వీన్‌గా

# భాగ్యశ్రీ బోర్సే



ఈ మధ్య కాలంలో తెలుగు తెరకి పరిచయమైన అందమైన కథానాయికల జాబితాలో భాగ్యశ్రీ బోర్సే ముందు వరుసలో కనిపిస్తుంది. పాలరాతి శిల్పానికి అప్పుడే ప్రాణం పోసినట్టుగా .. దేవలోకం నుంచి అప్పుడే దిగివచ్చినట్టుగా కనిపించే భాగ్యశ్రీకి, తొలి సినిమా నుంచే అభిమానుల సంఖ్య పెరగడం మొదలైంది. కలువల్లా విచ్చుకున్న కళ్లతోనే కబుర్లు చేప్పే భాగ్యశ్రీకి భారీ స్థాయిలో ఫాలోయింగ్ పెరుగుతూ వెళుతోంది. దాంతో అవకాశాలు కూడా ఆమెను వెతుక్కుంటూ వస్తూనే ఉన్నాయి. భాగ్యశ్రీ గొప్ప అందగత్తె అనడంలో ఎలాంటి సందేశం లేదు. అయితే ఆమె చేసిన రెండు సినిమాలు కూడా ఆశించిన స్థాయిలో ఆడలేదు. యూత్ హృదయాలపై ఆమె వేసిన గాఢమైన ముద్ర కారణంగా ఆ పరాజయాలు ఆమె కెరియర్ పై పెద్దగా ప్రభావం చూపలేదు. ఆమె కూడా లైట్ తీసుకుని తమిళంలో దుల్కర్ జోడీగా 'కాంత' .. తెలుగులో రామ్ సరసన 'ఆంధ్రా కింగ్ తాలూకా' సినిమాలు చేస్తూ వెళ్లింది. 'కాంత'నవంబర్ 14వ తేదీన విడుదలవుతుంటే, 'ఆంధ్రా కింగ్ తాలూకా' 27వ తేదీన విడుదల కానుంది.

'కాంత' టైటిల్ తోనే ఆడియన్స్ లో ఆసక్తిని రేకెత్తించింది. అంతేకాదు 1950లలో నడిచే కథ కావడం వలన ఆడియన్స్ మరింత కుతూహలంతో ఉన్నారు. ఆ కాలం నాటి లుక్ తో భాగ్యశ్రీ కొత్తగా కనిపిస్తోంది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, తన కెరియర్ కి హెల్ప్ అవుతుందని ఆమె భావిస్తోంది. ఇక రామ్ తో చేసిన 'ఆంధ్రా కింగ్ తాలూకా'లోను ఆమె పాత్ర డిఫరెంట్ గా అనిపిస్తోంది. చాలా తక్కువ గ్యాప్ లో ఒకదాని తరువాత ఒకటిగా విడుదలవు తున్న ఈ సినిమాలు, ఆమె కెరియర్ గ్రాఫ్ ను పెంచుతాయేమో చూడాలి.

## అందాల సుందరి

# ఆయేషా జాడలేదే!




ఏ సినిమాకైనా ప్రత్యేకమైన ఆకర్షణ హీరోయిన్ అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఎందుకంటే హీరోయిన్ ఆ సినిమాలో అందరి కంటే గ్లామరస్ గా కనిపిస్తుంది. పాటల్లో .. డాన్సులలో రొమాంటిక్ గా కనిపిస్తూ కవ్విస్తుంది. అలాంటి సినిమాలలో హీరోయిన్ కంటే మరొకరు గ్లామరస్ గా కనిపించే అవకాశాలు తక్కువగా ఉంటాయి. అలాగే హీరోయిన్ గురించి కాకుండా ఆ సినిమాలోని వేరే బ్యూటీని గురించి ఆలోచించే సందర్భాలు కూడా చాలా అరుదుగానే ఉంటాయి. అలా ఒక చిన్న పాత్రలో మెరిసిన బ్యూటీని చూసి కుర్రకారు మనసు పారేసుకుంది. ఇంతకాలం ఈ సుందరిని పెట్టుకోకుండా ఇంతమంది ఇన్నేసి సినిమాలు తీసేశారా అనుకుని ఆశ్చర్యపోయారు. ఎవరామె అనుకుంటూ సెర్చ్ చేశారు. అంతగా అందరి హృదయాలను చిలికేసిన ఆ మనోహరి పేరే ఆయేషా ఖాన్. 'ఓం భీమ్ బుష్' సినిమాలో ఆమెను చూసిన కుర్రాళ్లకు కొన్ని రోజుల పాటు కుదురు లేకుండా పోయింది. హాట్ లుక్స్ తో ఆకట్టుకునే ఈ సుందరి ఇంకా ఇక్కడ వరుస సినిమాలు చేయడం ఖాయమని అంతా అనుకున్నారు. అందానికీ .. ఆకర్షణకి ఆయేషా ఖాన్ కేరాఫ్ అడ్రెస్ గానే కనిపిస్తుంది. విశాలమైన కళ్లతో ఆమె చేసే విన్యాసాలకు కుర్రాళ్లంతా పట్టుబడిపోయారు. చక్కని కనుముక్కు తీరు కలిగిన ఆయేషా కాస్త సన్నబడితే హీరోయిన్ గా మెరవడం ఖాయమని అనుకున్నారు. కానీ ఎందుకనో తెలుగులో కొత్త ప్రాజెక్టులలో ఎక్కడా ఆమె పేరు వినిపించడం లేదు. హిందీలో మాత్రం ఒక సినిమా రిలీజ్ కి ఉన్నట్టుగా తెలుస్తోంది. తెలుగు వైపు నుంచి ఆమెకి ఛాన్సులు వెళ్లడం లేదా? ఆమెనే చేయడం లేదా? అనేది అభిమానులను వేధిస్తున్న ప్రశ్న. ఇక సమాధానం ఎప్పుడు దొరుకుతుందనేది చూడాలి.




## నేడు విడుదలవుతున్న

# 'మాస్ జాతర'



రవితేజ కథానాయకుడిగా భాను భోగవరపు దర్శకత్వంలో 'మాస్ జాతర' సినిమా రూపొందింది. శ్రీలీల కథానాయికగా నటించిన ఈ సినిమా, రేపు విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమా టీమ్ ప్రమోషన్స్ లో బిజీగా ఉంది. తాజా ఇంటర్వ్యూలో భాను భోగవరపు మాట్లాడుతూ, "నేను రవితేజ గారి అభిమానిని. అయన సినిమాలలో నాకు 'వెంకీ' అంటే చాలా ఇష్టం. ఆయనతోనే నా ఫస్టు మూవీ ఉంటుందని నేను అసలు ఊహించలేదు" అని చెప్పారు.
ఈ సినిమాకి 'మాస్ జాతర' అనే టైటిల్ పెట్టింది రవితేజ గారే. ఇది సాలీడ్ టైటిల్ కావడంతో, అందుకు తగినట్టుగా సీన్స్ ను డిజైన్ చేసుకోవడం జరిగింది. ఈ సినిమా తప్పకుండా పెద్ద హిట్ అవుతుందనే నమ్మకం ఉంది" అని అన్నారు. ఇక హైపర్ ఆది మాట్లాడుతూ .. 'ధమాకా' తరువాత నుంచి రవితేజ గారి సినిమాలలో వరుసగా చేస్తూ వెళుతున్నాను. ఈ సినిమాలు రవితేజగారితో కలిసి నేను చేసే కామెడీ ఆడియన్స్ కి నచ్చుతుంది" అని అన్నారు.

ఇక రవితేజ మాట్లాడుతూ .. " వేరే ఏ విషయం గురించి మాట్లాడమని చెప్పినా మాట్లాడతాను. కానీ నా గురించి .. నా సినిమాను గురించి మాట్లాడటం నాకు ఇష్టం ఉండదు. ఇలా వచ్చేస్తున్నాయ్ .. అలా వచ్చేస్తున్నాయ్ .. బాగా వచ్చేస్తున్నాయ్ అన్ని నేను చెప్పలేను. భాను డైరెక్షన్ .. అతని రైటింగ్ ఈ సినిమాకి హైలైట్ గా నిలుస్తుందనేది మాత్రం నిజం. ఒకటి మాత్రం చెప్పగలను .. మనకి మరో కమర్షియల్ డైరెక్టర్ వస్తున్నాడు" అని అన్నారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**